ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

బుధవారం 15 అక్టోబరు 2025

అక్కడ వారిద్దరిదే హవా...

వైసీపీ ప్రభుత్వ హయాంలో తాలిబాన్ రాజ్యంగా పేరొందిన తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రభుత్వం మారినా ఆ గుర్తింపు మాత్రం పోవడం లేదు. ఆ ప్రభుత్వంలో నాయకులు ఎలా వ్యవహరించారో కూటమి ప్రభుత్వంలో కూడా నాయకులు అలాగే వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఓ ముఖ్య నేత పేరు చెప్పుకుని ఇద్దరు చోటా నాయకులు చక్రం తిప్పుతున్నారు. వారు చెప్పిందే వేదంగా అక్కడ నడుస్తోంది. ఇరిగేషన్ పనుల్లో కాంట్రాక్టర్లను బెదిరించి వారికి కమీషన్లు ఇచ్చిన వారికే పనులు దక్కేలా చక్రం తిప్పారు. నీరు-చెట్టు పనుల్లో కూడా కమీషన్లు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇరిగేషన్ జేఈ తమ్ముడు కాంట్రాక్టర్ కావడంతో పనులు దక్కించుకునేందుకు నియోజకవర్గంలో ముఖ్య నేతలను జేఈ తన గుప్పిట్లో పెట్టుకుని చక్రం తిప్పుతున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.

- వారు చెప్పిన వారికే పనులు
- టెండర్లలో పాల్గొంటే బెదిరింపులు
- చక్రం తిప్పిన ఇద్దరు చోటా నాయకులు
- నీరు-చెట్టు పనుల బిల్లుల్లోనూ కమీషన్లు
- ఆ జేఈదీ పెద్ద చరిత్రే
- ఇదీ తంబళ్లపల్లె మార్కు అరాచకం



బి.కొత్తకోట మండలం బీరంగి గ్రామంలో నాసిరకంగా చేసిన చెరువు కట్ట పని

(రాయచోటి- ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలో జరుగుతున్న రూ.99.9 లక్షల విలువైన నీటి పారుదలశాఖ పనుల్లో టెండర్ల మాట ఉత్తుత్తిదే అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొన్నా వారిని బెదిరించి పనులు చేయనీయకుండా అడ్డుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గంలోని ఓ నాయకుడు చెప్పిన వారికే అన్ని పనులూ కట్టబెట్టారని పలువురు ఆరోపిస్తున్నారు. దీనివెనుక టీడీపీకి చెందిన ఇద్దరు చోటా నాయకులు చక్రం తిప్పారని సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. సందట్లో సడేమియా చందంగా 2014-19 మధ్యకాలంలో జరిగిన నీరు-చెట్టు పనుల బిల్లుల చెల్లింపుల్లోనూ కాంట్రాక్టర్ల దగ్గర ముక్కుపిండి మరీ కమీషన్లు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కమీషన్లలో ముఖ్య నాయకుడితో పాటు చోటా నాయకులు కూడా వాటాలు పంచుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారమే ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

తంబళ్లపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా నీటి పారుదల శాఖలోని 11 పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.99.9 లక్షలు విడుదల చేసింది. ఈ పనులకు గత నెల 10న టెండర్లు నిర్వహించారు. అందులో 5 పనులను నీటి సంఘాలే చేపడుతున్నాయి. ఈ పనులకూ టెండర్లు పిలవాలని అనుకున్నా కొందరు నీటి సంఘం నాయకులు పట్టుబట్టి ఆ కమీషనేదో తామే ఇస్తామనడంతో వారికే కేటాయించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంతో ఏ విధంగానూ సంబంధం లేక పోయినా అక్కడ పెత్తనం చెలాయించే మదనపల్లెలో ఉండే ఓ నాయకుడు, కురబలకోట మండలానికి చెందిన ఓ నాయకుడు తాము ముఖ్య నేత అనుచరులమని చెప్పుకుంటూ మిగిలిన 6 పనులకు టెండర్లలో ఎవరూ పాల్గొనకుండా అడ్డుకున్నారు. అయినా ఇద్దరు టెండర్లు వేసి పనులు దక్కించుకున్నా వారికి బిల్లులు చేయనీయమని బెదిరించారు. దీంతో టెండర్లు దక్కించుకున్న వాళ్లు తాము పనులు చేయలేమని జలవనరులశాఖ ఈఈకి లేఖ రాసేసి పనులు వదిలేసుకున్నారు. దీంతో ఈ పనులను తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఓ మండల ఇరిగేషన్ జేఈ తమ్ముడు, రాయచోటికి చెందిన మరో వ్యక్తి దక్కించుకున్నారు. ఇందుకు ఆ ఇద్దరు నాయకులకు వారు 6 శాతం కమీషన్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పనులు దక్కించుకున్న వారు బి.కొత్తకోట మండలం బీరంగి గ్రామం ముక్కునాయనకుంట పనిని తూతూమంత్రంగా మూడు రోజుల్లో పూర్తిచేసి రూ.9 లక్షలు బిల్లులు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అవినీతి అక్రమాలతో కూడిన ఈ టెండర్లను రద్దు చేయాలని పలువురు సాగునీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులు రాయచోటిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

నీరు-చెట్టు పనులనూ వదలని వైనం

ఆ ఇద్దరు చోటా నాయకులు 2014-19 మధ్యలో జరిగిన నీరు-చెట్టు పనులనూ వదలలేదని సమాచారం. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో కోట్ల రూపాయల వ్యయంతో నీరు-చెట్టు పనులు జరిగాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనుల బిల్లులు నిలిపివేసింది. దీంతో ఎంతోమంది టీడీపీ నాయకులు అప్పుల పాలయ్యారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ పనుల బిల్లులకు నియోజకవర్గానికి సుమారు రూ.10 కోట్లు విడుదల చేసింది. అప్పట్లో ఈ పనులు చేసిన టీడీపీ నాయకులకు ఈ బిల్లులు చెల్లించాల్సి ఉండగా నియోజకవర్గ ముఖ్యనేత తరఫున ఆ చోటా నాయకులు ఇద్దరూ బిల్లుల్లో 6 నుంచి 7 శాతం కమీషన్ ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఇలా సుమారు రూ.60 లక్షలకుపైగా కమీషన్లు వసూలు చేసి ముఖ్య నాయకుడితో కలిసి ఇద్దరూ వాటాలు పంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆ జేఈది పెద్ద చరిత్రే

నియోజకవర్గం పరిధిలలోని ఓ మండల ఇరిగేషన్ జేఈగా పనిచేస్తున్న అతనిది పెద్దచరిత్ర ఉందని పలువురు పేర్కొంటున్నారు. 2021లో ఇక్కడకు జేఈగా వచ్చిన ఆయన ముదివేడు రిజర్వాయర్ పనుల పర్యవేక్షణలో ముఖ్యభూమిక పోషించాడు. వైసీపీ మద్దతుదారుగా పేరొందిన ఆయన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా టీడీపీ నాయకులను ప్రసన్నం చేసుకుని అదే మండలంలో జేఈగా కొనసాగుతున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉండగా వారందరినీ అక్కడి నుంచి బదిలీ చేయించి వారందరి పనీ ఈయన ఒక్కరే చూస్తుండటం విశేషం. ఇటీవల నిర్వహించిన టెండర్లలో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఒకరు ఈ జేఈ తమ్ముడు కావడం గమనార్హం. అందుకే మొత్తం పనులు తన తమ్ముడికే దక్కాలని పక్కాగా ప్లాన్ వేసి రూ.కోటి విలువైన పనుల టెండర్లను ఎవరికీ రానీయకుండా చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. తన మాట వినని ఉన్నతాధికారిని సైతం తంబళ్లపల్లె నుంచి బదిలీ చేయించేందుకు ఓ నేత ద్వారా పైస్థాయి నాయకులకు ఫిర్యాదు చేయించినట్లు సమాచారం.

వైభవంగా సీతారాముల కల్యాణం



వాల్మీకిపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టాభి రామాలయంలో మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ మొదలు ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవ, ప్రత్యేక పూజలు జరిగాయి. సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను విశేషాలంకరణలతో తీర్చిదిద్దారు. ఆలయ మండపంలో మామిడి తోరణాలు, పుష్పాలంకరణలతో శోభాయమానంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై సీతారాములను అదిష్ఠింపచేశారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల ఘోష, విశేష భక్తజనం నడుమ కల్యాణం కమనీయంగా సాగింది. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు టీటీడీ తీర్థ ప్రసాదాలు, వస్త్రాలు పంపిణీ చేశారు. సాయంత్రం సీతారామలక్ష్మణులను తిరుచ్చిపై పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, భాషికాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఏపీ కార్ల్‌కు నేడు జర్మన్ బృందం రాక



ఏపీకార్ల్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పులివెందుల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ కార్ల్‌కు జర్మన్ బృందం రాక సందర్భంగా ఇక్కడ చేపట్టిన ఏర్పాట్లను మంగళవారం మధ్యాహ్నం కడప కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఏపీ కార్ల్‌లో ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం సాగుతోంది. దీనిని పరిశీలించేందుకు బుధవారం జర్మనీకి చెందిన రాయబారుల బృందం రానుంది. ఇక్కడ సాగుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని, అలాగే ఏపీ కార్ల్‌లోని ల్యాబ్‌లు తదితర వాటిని పరిశీలించనున్నారు. అలాగే జర్మన్ బృందంతో ఇంటరాక్షన్ ఉండడంతో కలెక్టర్ సెమినార్ హాల్, ల్యాబ్‌లు తదితర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నయ్య, ఏపీ కార్ల్ ఇన్‌చార్జి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురక్ష యాప్‌ను సద్వినియోగం చేసుకోండి

- ఈఎస్ మధుసూదన్

మదనపల్లె టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎక్సైజ్ సురక్ష యాప్‌ను మద్యం వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. మంగళవారం ఈఎస్ మదనపల్లెలో మాట్లాడుతూ కల్తీ మద్యం నివారణకు, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలోని 122 మద్యం దుకాణాలు, 11 బార్లలో పనిచేసేవారు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి వారు విక్రయించే ప్రతి బాటిల్‌ను స్కాన్ చేసి వినియోగదారుడికి అందజేస్తారన్నారు. వినియోగదారుడు కూడా ఈ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని వారు కొనుగోలు చేసే మద్యం బాటిల్ వివరాలను తెలుసుకోవచ్చన్నారు. కల్తీ మద్యం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు వినియోగదారుడి దృష్టికి వస్తే ఆయా ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు ఫిర్యాదు చేయాలని ఈఎస్ కోరారు.

టీచర్లకు విదేశీ పర్యటన

ప్రపంచస్థాయి విద్యావిధానాలపై అధ్యయనం ● 160 మంది ఉపాధ్యాయులకు అవకాశం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో కొత్త దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉపాధ్యాయుల వృత్తిగత నైపుణ్యాల పెంపుకోసం విదేశీ అధ్యయన పర్యటనలు చేపట్టే ప్రణాళిక సిద్ధమైంది. ప్రపంచంలోని ఉత్తమ విద్యా విధానాలను తెలుసుకుని, ప్రభుత్వ పాఠశాల ల్లో అమలు చేయడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. ఈ విదేశీ పర్యటనలు విద్యారంగంలో కొత్త మార్గదర్శకాలు, నూతన ఆలోచనలకు దారితీయనున్నాయి. భవిష్యత్ తరాలకు ఉత్తమ విద్య అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఇవి బలమైన పునాది వేస్తాయని విద్యావేత్తలు భావిస్తున్నారు.

ఐదు రోజుల పర్యటన : విదేశీ పర్యటన మొత్తం ఐదు రోజులపాటు కొనసాగనుంది. ప్రతి బ్యాచ్‌లో 40 మంది ఉపాధ్యాయులు పాల్గొంటారు. మొత్తం నాలు గు బ్యాచ్‌లు ఈ పర్యటనకు వెళతాయి. అంటే 160 మంది ఉపాధ్యాయులు ఈ అరుదైన అవకాశాన్ని పొందనున్నారు.

ఎంపిక ఇలా : ఉపాధ్యాయుల ఎంపికను కలెక్టర్, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించనున్నారు. ప్రతి జిల్లాలో మూడు కేడర్ల నుంచి ఒక్కో ఉపాధ్యాయుడిని ఎంపిక చేస్తారు. ఎస్జీటీ/ఎల్ పీ/పీఈటీ/టీజీటీ లేదా తత్సమాన కేడర్ నుంచి ఒకరు, ఎస్ఏ/పీజీటీ లేదా తత్సమాన కేడర్ నుంచి ఒకరు, జీహెచ్ఎం లేదా ప్రిన్సిపాల్ కేడర్ నుంచి ఒకరిని ఎంపిక చేస్తారు. కనీసం పది సంవత్సరాల సేవ పూర్తిచేసి ఉండాలి. 55 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ మేరకు ఈ నెల 23వ తేదీ లోపు ఉత్తమ ఉపాధ్యాయుల జబితాను కలెక్ట ర్లకు పంపాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

పర్యటన ప్రాంతాలు: సింగపూర్, ఫిన్లాండ్, వియత్నాం, జపాన్ దేశాల్లో జరగనున్నాయి. వీటిలో విద్యావిధానం, పాఠశాల బోధన పద్ధతులు, విద్యార్థి-ఉపాధ్యాయ సంబంధాలు, సాంకేతిక వినియోగం వంటి అంశాలను ప్రత్యక్షంగా అధ్యయనం చేయనున్నారు.

దీనిపై సమాచారం లేదు

ఉపాధ్యాయుల విదేశీ పర్యటనకు సంబంధించి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సమాచారం. దీనిపై మాకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. పర్యటనకు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తారని అంటున్నారు. జోన్ వారీగా పరిశీలిస్తే రాయలసీమ జిల్లాల నుంచి 40 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు విదేశీ పర్యటన అవకాశం లభిస్తుంది. - డాక్టర్ షంషుద్దీన్, డీఈవో, కడప

వనరులను సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులతో మాట్లాడుతున్న వైవీయూ వీసీ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయంలో లభించే వనరులను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంచుకోవడంతో పాటు సమాజానికి ఉపయోగపడే ప్రభావవంతమైన మానవ వనరుగా మారాలని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ఆకాంక్షించారు. మంగళవారం అన్నమాచార్య సెనేట్ హాల్లో విశ్వవిద్యాలయ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని తప్పక పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైవీయూ నూతనంగా ఆవిర్భవించినప్పటికి అతి పాత విశ్వవిద్యాలయాలతో అన్ని అంశాల్లో పోటీపడుతోందన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి మీ సలహాలు కూడా స్వీకరిస్తానన్నారు. విశ్వవిద్యాలయంలో లభించే వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయ ప్రగతికి మీ సహకారం అవసరమన్నారు. ఈ సమావేశంలో వైవీయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

స్మగ్లర్‌కు ఐదేళ్లు జైలుశిక్ష, రూ.6 లక్షల జరిమానా ● ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



ఎర్రచందనం కేసులో జైలుశిక్ష పడ్డ ముద్దాయితో పోలీసులు

రాయచోటిటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానాను తిరుపతి జిల్లా ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు తీర్పు వెలువరించిందని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలకడ మండలం ముడియంవారిపల్లెకు చెందిన గడ్డం రవి మరో నలుగురితో కలిసి ఎర్రచందనం అక్రమంగా రవాణా చేస్తుండగా 2018 సంవత్సరంలో అప్పటి కేవీ పల్లి ఎస్ఐ శివకుమార్ నేతృత్వంలో స్మగ్లర్లను అరెస్టు చేసి కేసు నమోదు చేశారన్నారు. ఈ క్రమంలో కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడు స్మగ్లింగ్ చేసినట్లు నిర్ధారణ కావడంతో ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానాను నిందితుడికి విధించిందని, జరిమానా చెల్లించని పక్షంలో మరో 6 నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. ఈ కేసులో మిగతా నలుగురిని కోర్టు నిర్దోషులుగా విడుదల చేసిందన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసుల నిఘా ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. కేసు విచారణ, పర్యవేక్షణలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

సిబ్బంది కొరత లేకుండా చేస్తాం

- కలెక్టర్ నిశాంత్‌కుమార్



ఆస్పత్రి పనితీరుపై రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రైల్వేకోడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది కొరత లేకుండా చేస్తామని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో గైనకాలజిస్టు లేరని ఆ పోస్టును భర్తీ చేస్తామని, ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్ మాట్లాడుతూ కోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ లేదని, డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఆస్పత్రిలో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరగా అన్ని సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. రోగులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడారు. ఆస్పత్రి, ఈసీజీ పనితీరు గురించి ఆరా తీశారు. అనంతరం రైల్వేకోడూరు-చిట్వేలి డబుల్ రోడ్డు పనులను పరిశీలించారు. సుమారు రూ.40 కోట్లతో పనులు జరుగుతున్నాయని, కల్వర్టులు, సిమెంట్ రోడ్లు, తారురోడ్ల పనులు జరిగాయని, ఇంకా పనులు కొంత పెండింగ్ ఉందని ఆర్ అండ్‌బీ శాఖాధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఇటీవల వేసిన తారు రోడ్డు నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆంజనేయులు, వైద్యులు ధనశ్రీ, పృధ్వీ, సాయి, ఆర్అండ్‌బీ ఈఈ సహదేవరెడ్డి, డీఈ జయప్రకాశ్, డివిజనల్ డీఎల్‌పీవో మస్తాన్, డిప్యూటీ తహసీల్దార్ మానస, ఆర్ఐ లక్ష్మీదేవి, ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రానాయక్ కేసులో విచారణాధికారి నియామకం

- అనంతపురం జేడీగా తుఫాను సహాయ నిధుల్లో గోల్‌మాల్
- ప్రస్తుతం కడప జేడీగా చంద్రానాయక్ విధులు



కలికిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రానాయక్‌పై నమోదైన నిధుల దుర్వినియోగం కేసును పూర్తిస్థాయిలో విచారణ కోసం ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఆయన అనంతపురం జేడీగా పనిచేసే కాలంలో తఫాను సహాయ నిధుల్లో అక్రమాలకు పాల్పడిన విషయంలో సంజాయిషీ కోరుతూ అన్నమయ్య డీఏవోగా ఉండగా గత ఏడాది సెప్టెంబరు 23న సంజాయిషీ నోటీసులు జారీఅయ్యాయి. ఆయన సంజాయిషీలు సంతృప్తికరంగా లేకపోవడంతో విచారణకు ఆదేశించారు. ఈ అక్రమాలకు సంబంధించి అభియోగాలు నమోదయిన చంద్రానాయక్‌తో పాటు ఉరవకొండ ఏడీఏ ఎస్.పద్మజ, ప్రస్తుతం అనంతపురం ఏడీఏ కార్యాలయంలో పనిచేస్తున్న విడపనకల్ మండల వ్యవసాయాధికారిణి ఆర్.మధుమతి, డోనెకల్ వీఏఏ విజయభాస్కర్‌పై కూడా విచారణ జరపనున్నారు. గుంటూరు వ్యవసాయ శాఖ డైరెక్టరు కార్యాలయంలో అడిషనల్ డైరెక్టరుగా పనిచేస్తున్న వి.వి.విజయలక్ష్మిని విచారణాధికారిగా, ఆమెకు సహాయకారిగా అనంతపురం డీఏవో కార్యాలయం జేడీ యు.ఉమామహేశ్వరమ్మ ను నియమించారు. నెల రోజుల్లోగా విచారణ పూర్తిచేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఇవీ అభియోగాలు..

అనంతపురం జిల్లా విడపనకల్ మండలం డోనెకల్ గ్రామంలో 2021 ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు అధిక వర్షాల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లింది. రైతులకు పరిహారంగా పంపిణీ చేసిన నిధుల్లో రూ.1,52,02,812లు అనర్హులకు అందజేశారని లోకాయుక్తకు ఫిర్యాదు అందింది. దీనిపై ఈ-క్రాప్ నమోదు చేసే ప్రక్రియకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ రూపొందించిన వెండర్‌కు జాబితాను ఇచ్చి తప్పిదాలను నిగ్గుదేల్చాలని చెప్పారు. వీఏఏ విజయభాస్కర్ సరైన ఫార్మాట్‌లో ఈ-క్రాప్ వివరాలు నమోదు చేయని కారణంగా ఇందులో తప్పిదాలను గుర్తించేందుకు సాధ్యం కావడం లేదని సాఫ్ట్‌వేర్ వెండర్ తేల్చారు. అయితే వెబ్‌ల్యాండ్, మీ భూమి రికార్డులతో పోల్చి కనీసం రూ.10,39,085లు కచ్చితంగా దుర్వినియోగమైందని అధికారులు నివేదిక ఇచ్చారు. ఎలాంటి సాగుకు నోచుకోని భూములతోపాటు వామిదొడ్డి, ఇంటి స్థలాల సర్వే నంబర్లకు పరిహారం చెల్లించినట్లు గుర్తించారు.

ఈ-క్రాప్ నమోదు స్థాయిలోనే అక్రమాలు చోటుచేసుకుని అనర్హులు లబ్ధి పొందినట్లు తేల్చారు. నిబంధనల ప్రకారం వీఏఏ నమోదు చేసిన ఈ-క్రాప్‌లో మండల వ్యవసాయాధికారి 20 శాతం, ఏడీఏ 20 శాతం, జాయింట్ డైరెక్టరు 5 శాతం నమోదును పరిశీలించి ధ్రువీకరించాల్సి ఉంది. ఈ పరిశీలనలో వీరంతా విఫలం కావడంతోనే నిధుల దుర్వినియోగానికి ఆస్కారం ఏర్పడిందని భావించి వీరందరిపై అభియోగాలు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ-క్రాప్ వివరాలను క్షేత్రస్థాయిలో లోతుగా విశ్లేషించి అక్రమాలను నిగ్గుతేల్చడానికి విచారణ కోసం ఉన్నతాధికారులను నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఆదేశాలు జారీచేశారు.

జనార్దన్‌రావు కోసం పీటీ వారెంట్

- తంబళ్లపల్లె కోర్టులో దాఖలు చేసిన ఎక్సైజ్ పోలీసులు



దాడుల సమయంలో పట్టుబడ్డ నిందితులు (ఫైల్)

ములకలచెరువు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మద్దేపల్లి జనార్దన్‌రావును అరెస్టు చూపేందుకు అనుమతి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు మంగళవారం తంబళ్లపల్లెలో పీటీ వారెంట్ దాఖలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో జరిగిన నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన నిందితుడైన జనార్దన్‌రావును ఈనెల 10వ తేదీ గన్నవరం ఎయిర్‌పోర్టుకు రావడంతో ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ ఎక్సైజ్ కోర్టు జనార్దన్‌రావుకు ఈనెల 17వ తేదీ వరకు రిమాండ్‌కు విధించడంతో నెల్లూరులోని కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ క్రమంలో ములకలచెరువు కేసులో కూడా ఏ1గా ఉన్న జనార్దన్‌రావును అరెస్టు చూపేందుకు అనుమతి కోరుతూ తంబళ్లపల్లె కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. అలాగే ఈ కేసులో ఏ23గా ఉన్న కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లెకు చెందిన శ్రీనివాసులురెడ్డిని కూడా ఇబ్రహీంపట్నం కేసులో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీనివాసులురెడ్డిని కూడా అరెస్టు చేసేందుకు పీటీ వారెంట్ దాఖలు చేశారు. నకిలీ మద్యం తయారీ కేసులో ఇప్పటికే అరెస్టయి మదనపల్లె సబ్‌జైలులో ఉన్న 10 మంది నిందితులను కస్టడీకి కోరుతూ ఎక్సైజ్ అధికారులు తంబళ్లపల్లె కోర్టులో దాఖలు చేసిన పిటీషన్ బుధవారానికి వాయిదా పడింది.

సిట్‌కు కేసు రికార్డులు

ములకలచెరువు నకిలీ మద్యం కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌తో పాటు పలు రికార్డులను స్థానిక ఎక్సైజ్ అధికారులు సిట్‌కు పంపారు. ఇప్పటి వరకు అరెస్టయిన నిందితుల వాంగ్మూలాలు, సీజ్ చేసిన సెల్‌ఫోన్లు తదితర రికార్డులను విజయవాడకు పంపారు. ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసుకు సంబంధించిన రికార్డులు మొత్తం సిట్ అధికారులకు పంపారు. సిట్ బృందం కేసు రికార్డులు పూర్తి స్థాయిలో పరిశీలించి ములకలచెరువుకు వస్తుందని స్థానిక అధికారులకు సమాచారం అందింది.

వైసీపీ పాలకపక్షం పాపం..!

- స్వపక్షంలోనే విపక్షం.. అజెండా అంశాల రద్దు
- వరుస వాయిదాలతో ప్రజల బేజారు
- ముందుకు సాగని పనులు ● ముంచుకొస్తున్న ఎన్నికల గడువు

పట్టణాభివృద్ధికి ఆటంకం..

మదనపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పాలకవర్గం గడువు ఇక ఆరునెలల్లో ముగియనుంది. ఈ నాలుగున్నరేళ్ల వెనక్కి చూసుకుంటే, పట్టణంలో ఎక్కడా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని పాలకవర్గంలోని వైసీపీ కౌన్సిలర్లే బాహాటంగా చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలో నిధులు పుష్కలంగా ఉన్నా.. వాటినీ వినియోగించుకోవడంలో పాలకవర్గం విఫలమవుతోంది. స్వపక్షంలోనే విపక్షంలా రెండువర్గాలుగా విడిపోయి అటు అధికారులు, ఇటు తటస్థ కౌన్సిలర్లకు తలనొప్పిగా మారింది. కూటమి ప్రభుత్వ పాలనలో మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ తమను సంప్రదించకుండా స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల చెప్పినట్లు నడుచుకుంటున్నారని ఓ వర్గం ఆరోపిస్తోంది. ఈ క్రమంలో అప్పటివరకూ కొన్ని సమావేశాలు సవ్యంగా సాగినా... తర్వాత అడ్డంకులు, అవరోధాల మధ్య కౌన్సిల్ సమావేశాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో అజెండాలోని కొన్ని అంశాలు ఆమోదం పొందగా, మరికొన్ని పెండింగ్ పడుతుండగా, ఇంకొన్ని ఏకంగా రద్దుకు గురవుతున్నాయి.



మదనపల్లె మున్సిపల్ కార్యాలయం

ఇటీవల జరిగిన రెండు సమావేశాలను తీసుకుంటే అజెండాలోని కొన్ని అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పక్కన పెట్టేయగా, సెప్టెంబరు సమావేశంలోని అజెండాను పూర్తిగా వాయిదా వేశారు. ఇలా ఒకరికి మించి మరొకరు పంతాలు, పట్టింపులకు పోతూ అభివృద్ధి పనులు ఆగిపోవడానికి కారణమవుతున్నారు. అది సాధారణ సమావేశమైనా.. అత్యవసర సమావేశమైనా.. మున్సిపల్ పాలకవర్గం తీరు మాత్రం అంతే. మున్సిపల్ పాలకవర్గంలో ఒక టీడీపీ కౌన్సిలర్ మినహా మెజారిటీ స్థానం వారిదే. అయితే ఇరుపోటీల మధ్య ఇల్లు చెడా.. పైపోటీల మధ్య పల్లె చెడే అనే సామెతను గుర్తు చేస్తూ, అందులోని రెండువర్గాల వ్యవహార శైలి అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారనే విమర్శలకు తావిస్తోంది. గత నాలుగేళ్ల వైసీపీ పాలనలో ప్రజలే కాదు.. మున్సిపల్ పాలకవర్గం కూడా విసిగి వేసారి పోయింది. మున్సిపాలిటీలో అధికారం కౌన్సిల్‌దే అయినా.. స్థానిక ప్రజాప్రతినిధి జోక్యంతో అటు కౌన్సిలర్లు, ఇటు చైర్‌పర్సన్ కూడా నామమాత్రంగా మారారు. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపల్ పాలకవర్గంలోని కొందరు వైసీపీ కౌన్సిలర్లకు.. పట్టణాభివృద్ధిపై ఆశలు చిగురించాయి. ఇక పాలకవర్గానికి పూర్తిస్థాయిలో పట్టు ఉంటుందని, ఇక మిగిలిన ఏడాదిన్నరలోనైనా అభివృద్ధిని పరుగులు పెట్టించాలని భావించారు. అయితే వారు అనుకున్నట్లు ఆరునెలలు మాత్రమే పరిపాలన సవ్యంగా సాగగా, తర్వాత మళ్లీ మొదటికొచ్చినట్లయింది. వార్డులో అధికారం తమదే అయినా.. కౌన్సిలర్లకు ఏమాత్రం విలువ లేకుండా కూటమి నాయకులు వార్డుల్లో తమకు సమాంతరంగా ఇన్‌చార్జులను నియమించారని వాదన మొదలైంది. ఇక అధికారం కూటమిదే అయితే కౌన్సిల్ అజెండాలోని అంశాలనూ వారినే ఆమోదించుకోవాలని, తమతో పనేంటని వైసీపీ నిలదీస్తోంది. ఈ క్రమంలో చైర్‌పర్సన్ సిద్ధం చేసిన అజెండాలోని కొన్ని అంశాలను పక్కన పెట్టడం, తిరస్కరించడం మొదలు పెట్టారు. అక్కడి నుంచి మొదలైన వివాదం.. ఇప్పటి వరకూ కొనసాగుతూనే వుంది. తమ ప్రమేయం లేకుండా, తమను సంప్రదించకుండా వార్డుల్లో పనులు ఎంపిక చేశారని, అజెండాలో పెట్టారని కొందరు కౌన్సిలర్లు ఆక్షేపించారు.

ఈ అంశాలను పక్కన పెడితే, ఆగస్టు, సెప్టెంబరులో జరిగిన సాధారణ, అత్యవసర సమావేశాలు ఏమాత్రం ఫలితం ఇవ్వలేదు. ఇందులో ఒక సమావేశంలో అజెండా అంశాలను పక్కన పెట్టగా, మరో సమావేశంలో అజెండానే వాయిదా వేసేశారు. ఈ క్రమంలో పట్టణంలో ప్రధానమైన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలకు అడ్డుకట్ట పడింది. గత ప్రభుత్వంలో బిల్లులు సక్రమంగా రాగా, కాంట్రాక్టర్లు పనులు నిలిపేశారు. దీంతో తమ వార్డులో ఒక్క పనిచేయలేదని, చివరి రోజుల్లోనైనా కనీసం రోడ్డు, కాలువలు నిర్మిద్దామంటే, ఇలా పనులు అడ్డుకోవడం ఏంటని కొందరు కౌన్సిలర్లు మౌనంగా రోదిస్తున్నారు.

ప్రధాన సమస్యలు.. ఆగిన పనులు

వర్షాకాలంలో ప్రశాంత్‌నగర్, ఎ.వి.నాయుడు కాలనీ, సప్తగిరినగర్‌లను ముంచెత్తుతున్న వరద నీటిని దారి మళ్లించేందుకు రూ.1.75 కోట్లతో డ్రైనేజీ నిర్మాణానికి కౌన్సిల్ పరిపాలనా ఆమోదం తెలిపింది. తర్వాత టెండర్ దశ పూర్తయి పనులు ప్రారంభం కాగా, వివిధ కారణాలతో ఈ అంశాన్ని పక్కన పెట్టేయగా, పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రశాంత్‌నగర్ వాసులు కొన్నేళ్లుగా కోరుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని కదిరిరోడ్డు వెంబడి మార్కెట్‌యార్డు నుంచి ప్రశాంత్‌నగర్ మెయిన్ లైన్ వరకూ కాలువ నిర్మాణాన్ని ఓ వర్గం అడ్డుకోగా బ్రేక్ పడింది.

- నక్కలదిన్నెలో అమృత్ పథకం కింద రూ.1.30 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకు మంజూరైంది. గతంలో ప్రాథమికంగా వేసిన అంచనా, సాంకేతిక పరంగా మరో రూ.30 లక్షలు అవసరమని గుర్తించారు. ఇందుకు మున్సిపల్ సాధారణ నిధులు వెచ్చించాలని ప్రతిపాదించగా కౌన్సిలర్లు అడ్డుకున్నారు. ట్యాంకు నిర్మాణానికి ముందు ప్రతిపాదించినట్లే అమృత్ నిధులతోనే చేపట్టాలని, సాధారణ నిధులు కేటాయించవద్దని కొందరు ఆక్షేపించారు. అది ఇప్పటికిప్పుడు సాధ్యం కాకపోవడంతో చివరకు ఆ పనులే రద్దయ్యే పరిస్థితి ఏర్పడింది.
- మున్సిపాలిటీలోని లబ్ధిదారులకు పట్టణ శివారులో టిడ్కో ఇళ్లు నిర్మించారు. 1872 మందికి ప్లాట్లు కేటాయించారు. వీరిలో చాలామంది ఇప్పటికే అక్కడ నివాసం ఉంటున్నారు. ఎమ్మెల్యే పర్యటనలో భాగంగా అక్కడి స్థానికులు వీధిలైట్లు వేయాలని విన్నవించారు. దీంతో రూ.11లక్షల వ్యయంతో వీధిలైట్లు ఏర్పాటుకు అజెండాలో అంశాన్ని చేర్చారు. దీన్ని కౌన్సిల్ వ్యతిరేకించింది.

మండలంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన


రైతు భూ సమస్య గురించి వింటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఓబులవారిపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. దీంతో జిల్లా, మండల స్థాయి అధికారులు పరుగులు పెట్టారు. ఉదయం 11.10 గంటలకు చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీలోని కస్తూర్బాగాంధీ విద్యాలయానికి చేరుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతరం వారు విద్యాలయంలో తరగతి గదులు, వంటగదులు, బాత్‌రూములను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న కళాశాల భవనాలను పరిశీలించారు. అనంతరం బొమ్మవరం గ్రామ పంచాయతీలోని చప్పిడి రమేష్ బాబు, కేవీ ప్రసాద్, కె.వెంకటేష్, వాసు, ఎరికలయ్య రైతుల సాగులో ఉన్న ఉద్యానవన పంటలను జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ సుభాషిని, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు మండలాల హార్టికల్చర్ ఆఫీసర్ భాస్కర్‌ల ఆధ్వర్యంలో పరిశీలించారు. ముందుగా మామిడి, అరటి, బొప్పాయి, నన్నారి పంటల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా రైతు తిరుపయ్యనాయుడు తమ భూసమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు యామిని, ఆర్ఐ మల్లికార్జునరెడ్డి, ఎస్ఐ మహేష్, డీఈవో డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎల్.నాగయ్య, జీసీడీవో సుమతి, ప్రిన్సిపల్ రాజకుమారి, మండల విద్యాశాఖాధికారులు శివరామిరెడ్డి, రెడ్డెయ్య, టీడీపీ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బి.కమ్మపల్లె టీడీపీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

- రాష్ట్ర స్థాయిలో రెండు బంగారు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులు

రైల్వేకోడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో జాతీయ స్థాయి పోటీలకు రైల్వేకోడూరు ప్రభుత్వ బాలికల హైస్కూల్ విద్యార్థులు కె.సంధ్యన, కె.నవ్య ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామయ్య మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 10, 11, 12 తేదీల్లో బాపట్ల జిల్లా పెట్బూరు మండలంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో వీరు పాల్గొని బంగారు పతకాలు సాధించారని తెలిపారు. అంతేకాక నవంబరులో పంజాబ్‌లో జరగబోవు జాతీయ స్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారని, రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీరామ అనే విద్యార్థి కాంస్య పతకాన్ని సాధించినట్లు వివరించారు. కాగా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు, కోచ్ శివాజీ అభినందించారు.

వడ్డీ వ్యాపారుల ఇంటిముందు హిజ్రా ధర్నా

- డబ్బు, బంగారు తీసుకుని మోసం చేశారంటూ ఆరోపణ


వడ్డీవ్యాపారుల ఇంటి ముందు ధర్నా చేస్తున్న స్వాతి, బాధితులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారుల ఇంటి ముందు ఓ హిజ్రా ధర్నా చేసిన విషయం మంగళవారం చోటు చేసుకుంది. డబ్బు, బంగారు తీసుకోవడమే కాకుండా తనపై దాడికి దిగారని ఆరోపిస్తున్నారు. బాధితురాలి కథనం మేరకు... పట్టణంలోని గౌతమినగర్‌కు చెందిన స్వాతి (హిజ్రా) అనే తాను చీటీల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నానని, ఈ క్రమంలో తన స్నేహితురాలు చంద్రకళకు వడ్డీ వ్యాపారులు ఈశ్వర్, స్వర్ణలత వద్ద పూచీ పడి రూ.30 లక్షల వరకు అప్పు ఇప్పించానని తెలిపారు. అనంతరం తన స్నేహితురాలు ఐపీ పెట్టి వెళ్లిపోవడంతో పూచీ ఉన్న కారణంగా వడ్డీ వ్యాపారులు తనను నిలదీశారన్నారు. చేసేది లేక 2021 సంవత్సరం నుంచి వారికి ఫోన్‌పే ద్వారా నాలుగేళ్ల పాటు రూ.34 లక్షలు చెల్లించడంతో పాటు, వారి అకౌంటుకు రూ.8లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశానని ఆరోపించారు. ఇవే కాకుండా 600 గ్రాముల బంగారు, ఇంటి దస్తావేజులు కూడా వడ్డీ వ్యాపారులు తీసుకున్నారని, వాటిని తిరిగి ఇవ్వాలని కోరినా ఇవ్వడం లేదని తెలిపారు. కాగా మంగళవారం వడ్డీ వ్యాపారుల ఇంటి ముందు బాధితు లలో కలిసి ధర్నాకు దిగినట్లు తెలి పారు. ఇదిలా ఉండగా.. ఈ విషయమై తాను గత నెలలోనే టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, పోలీసులు తనకు న్యాయం చేయాలని కోరారు.

పాత జీఎస్టీతో అమ్మితే ఫిర్యాదు చేయండి

- డ్వామా పీడీ వెంకటరత్నం



ర్యాలీ నిర్వహిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

ములకలచెరువు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పాత జీఎస్టీతో ఎక్కడైనా వస్తువులు, సరుకులు ఇతర వస్తువులు విక్రయిస్తే టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. స్థానిక సీఎల్ఆర్‌సీ భవనంలో మంగళవారం ఎన్డీఏ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై తంబళ్లపల్లె నియోజకవర్గ స్థాయిలో ప్రజలు, మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో ఒక్కో కుటుంబానికి దాదాపు రూ.15 వేలు ఆర్థిక లబ్ధి చేకూరుతోందన్నారు. అనంతరం సీఎల్ఆర్‌సీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నక్రిష్ణా, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

కలకడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోతువారిపల్లెలో భార్యభర్తలపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. పోతువారిపల్లె వాసైన నాగయ్య అదే గ్రామానికి చెందిన భాగ్యమ్మకు పాత కక్షలున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉన్న నాగయ్య, అతని భార్య రెడ్డెమ్మపై భాగ్యమ్మ, కుమారుడు కిశోర్ దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి


చంద్రమోహన్‌రెడ్డి(ఫైల్)

పుల్లంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంత సముద్రం పంచాయతీ పాపక్కగారిపల్లె గ్రామంలో మంగళవారం సాయంత్రం విద్యుత్ శాఖకు గురై రైతు చిన్నిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి(48) మృతిచెందాడు. వ్యవసాయ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వస్తుండగా మోటారు పనిచేస్తుందో లేదోనని చెక్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. విషయం తెలుసుకున్న గ్రామ ప్రజలు చంద్రమోహన్‌రెడ్డిని ఓ ప్రైవేటు వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు ప్రభుత్వ వైద్యులు నిర్ధారించారు. ఆయన సతీమణి లక్ష్మీదేవి జీవనోపాధికై ఇటీవల కువైత్‌కు వెళ్లింది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పిల్లలు చిన్నవారు కావడంతో కుటుంబ పోషణ ఎలా అని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుల్లంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న యువకుడు

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక బాధలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నిమ్మనపల్లెలో చోటు చేసుకుంది. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసుల వివరాల మేరకు.. నిమ్మనపల్లె మండలం, ముష్టూరు గ్రామం, ఎర్రప్పగారిపల్లెకు చెందిన శంకర కుమారుడు సత్యనారాయణ (30) బెంగళూరులో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ మంగళవారం ఉదయం గ్రామానికి వచ్చారు. ఇంతలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన యువకున్ని కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు నిమ్మ నపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి యువతి...


చికిత్స పొందుతున్న యువతి

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భర్త మందలించాడనే కారణంతో పురుగుల మందు తాగి భార్య ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, మోతీనగర్, రెడ్డెమ్మ పిండిమిషన్ వద్ద కాపురం ఉన్న షేక్ వసీం భార్య హినాక్ కౌసిర్ (27) భర్త మందలించాడని మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స చేసిన డాక్టర్లు మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతికి రెఫర్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అపస్మారక స్థితిలోకి మహిళ


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కుటుంబ కలహాల నేపథ్యంలో మదనపల్లె మండలం, మాలేపాడు పంచాయతీకి చెందిన భీమేశ్వర భార్య శారద (30) మంగళవారం ఇంట్లో పురుగుల మందు తాగేసింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను భర్త గమనించి వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ప్రజాసంఘాల నాయకులు


పోలీసులతో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓ పేద కుటుంబంపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మదనపల్లెలోని జైభీమ్ భారత్ పార్టీ జిల్లా నాయకుడు కోన భాస్కర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏఐటీయూసీ తంబళ్లపల్లె నియోజకవర్గ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి సలీంబాషలు స్థానిక పోలీసుస్టేషన్ వద్ద వారు మాట్లాడారు. రాపూరివాండ్లపల్లె పంచాయతీ నాగన్నకోటకు చెందిన గండికోట చిన్నప్ప కుమారుడు వెంకటేష్ లారీ డ్రైవర్‌గా ఉంటూ తమ కుటుంబాన్ని పోషించుకునేవాడన్నారు. ఇదే క్రమంలో ఈ నెల 8న వెంకటేష్ తన వృత్తి రీత్యా వెళ్లాడని, ఈ నేపథ్యంలో సదరు గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న మల్లిఖార్జున కుమారులు ఇంట్లో నిద్రిస్తున్న మహిళను తలుపు తట్టి నిద్ర లేపారు. తెలిసిన వారు కావడంతో ఆ మహిళ తలుపు తీసింది. వారు మంచినీళ్లు కావాలని కోరడంతో పాటు ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించారని తెలిపారు. దీంతో ఆ మహిళ మరుసటి రోజు ఇంటికి వచ్చిన తన భర్తకు జరిగిన విషయాన్ని చెప్పడంతో వెంకటేష్ ఆ ఇద్దరు యువకులను నిలదీశాడు. దీంతో ఆ యువకులు ఆవేశంతో ఊగిపోయి వెంకటేష్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి అక్కడి చికిత్సలు అందిస్తున్నారని తెలిపారు. కాగా ఇదే విషయమై వెంకటేష్ భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు పీటీఎం పోలీసులు కేసు నమోదు చేశారే కానీ వారిని అరెస్టు చేయకుండా కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రజాసంఘాలు ఆరోపించాయి. ఎస్ఐ అందుబాటులో లేకపోవడంతో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్‌తో ప్రజాసంఘాల నాయకులు మాట్లాడారు. దాడి చేసిన వారిని పోలీస్‌స్టేషన్‌లో ఉంచాలని వారు డిమాండ్ చేశారు.

వ్యాపారిపై టీడీపీ నేత దాడి

- చంపేస్తానంటూ బెదిరింపులు


చికిత్స పొందుతున్న వ్యాపారి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో వ్యాపారిని టీడీపీ నాయకులు చితక బాదిన సంఘటన పట్టణంలోని చిప్పిలి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, సురభికాలనీకి చెందిన మోహన్ మురళి హంద్రీనీవా కాలువ సమీపంలో 1997లో రైతు నుంచి 19 సెంట్లు స్థలాన్ని కొనుగోలు చేశాడు. ఇటీవల తన పొలం పక్కనే మదనపల్లెకు చెందిన టీడీపీ నాయకులు, మున్సిపల్ మాజీ చైర్మన్ కొడవలి శివప్రసాద్ కొంత భూమిని కొనుగోలు చేసి మోహన్ మురళికి చెందిన భూమిని అక్రమించడానికి ప్రయత్నం చేశారు. దీంతో పలుమార్లు ఘర్షణ పడ్డారు. తన రికార్డులు పక్కాగా ఉన్నాయని ఎంతచెప్పినా వారు వినిపించుకోలేదు. కాగా మోహన్ మురళి తన పొలంలో పనులు చేసుకొంటూ ఉండగా అక్కడికి చేరుకున్న కొడవలి శివప్రసాద్, అతని తమ్ముడు కరుణాకర్, తమ డ్రైవర్‌తో కలిసి మోహన్ మురళిపై దాడి చేసి పిడుగుద్దులు గుద్ది చితకబాదారు. మరోసారి పొలంలోకి వస్తే చంపేస్తామంటూ బెదిరించారు. తాను హార్ట్ పేషెంటు అంటున్నా వినకుండా దాడి చేసినట్లు బాధితుడు వివరించారు. స్థానికులు అడ్డుకుని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు మదనపల్లె తాలుకా పోలీసులు కేసును విచారిస్తున్నట్లు చెప్పారు.

కోడిపందేలపై విస్తృత దాడులు

వాల్మీకిపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్పీ ధీరజ్ కనుబిల్లి ఆదేశాల మేరకు వాయల్పాడు మండలంలోని గండబోయనపల్లె గ్రామ పంచాయతీ మేకలవారిపల్లె అటవీ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం కోడి పందేలపై పోలీసులు డ్రోన్ కెమెరాలతో విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కోడి పందెం నిర్వహిస్తున్న ప్రాంతంలో 15మందిని అదుపులోకి తీసుకుని 18 ద్విచక్రవాహనాలు, నగదు రూ.24,200 స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్, వాల్మీకిపురం, నిమ్మనపల్లె, కలికిరి, కలకడ, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, జిల్లా ఎస్టీఎఫ్ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.


డ్రోన్ కెమెరాల దాడిలో పట్టుబడిన కోడిపందెం రాయుళ్లు

ఇరువర్గాల ఘర్షణ - కేసు నమోదు

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం, చీకలబైలు అడవిలో దర్గా నిర్మాణ విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. సోమవారం రాత్రి జెండాలు నాటుతుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. అటవీశాఖాధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చీకలబైలు గ్రామంలో అదే గ్రామానికి చెందిన కొందరి సహకారంతో అడవిలో స్థలం కబ్జా చేసి మదనపల్లెలోని కొందరు దర్గా నిర్మాణానికి సన్నాహాలు చేసి ముస్లిం జెండాలు నాటారు. అటవీశాఖాధికారిణి ఏబీవో ఉమా దర్గా నిర్మాణాన్ని అడ్డుకున్నారు. గ్రామస్థులు రోడ్డుపై దర్గా నిర్మించరాదని నిరసన చేపట్టారు. దీంతో వివాదం తారాస్థాయికి చేరింది. ఏబీవో ఉమా ఫిర్యాదు మేరకు మదనపల్లె తాలుకా పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

రుషివాటిక ఘటనపై విచారణ


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి లక్ష్మీనరసయ్య

బి.కొత్తకోట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టు పంచాయతీ గట్లపై నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలో గత నెల 7న జరిగిన ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి లక్ష్మీనరసయ్య మంగళవారం విచారణ చేపట్టారు. ఈ ఘటనలో పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న లక్కిరెడ్డిపల్లి మండలం కాలాడివాండ్లపల్లెకు చెందిన విద్యార్థి శేషాద్రిరెడ్డి కంటికి తీవ్రగాయమై కనుచూపు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ విషయమై బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో తమకు న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. పోలీసులు పాఠశాలలో, బాధిత విద్యార్థి నివాసంలో విచారణ చేపట్టారు. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఈ ఘటనపై స్పందించారు. ఘటనపై సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలంటూ వివిధ శాఖల అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం. జిల్లా వైద్యాధికారి లక్ష్మీనరసయ్య సంబంధిత పాఠశాలకు వెళ్లారు. కనుచూపు కోల్పోయిన విద్యార్థి శేషాద్రిరెడ్డి తోటి విద్యార్థులను, పాఠశాల సిబ్బందిని విచారించారు. తమ విచారణలో తెలిసిన వివరాలను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డా.శ్రీధర్, ప్రభాకర్, విజయలక్ష్మి, రెడెమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

పసుపు పంటకు.. తెగుళ్లు

● అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి ● సకాలంలో మందులు పిచికారి చేయాలి
● జాగ్రత్తలు పాటించకపోతే పంటంతా నాశనం ● హార్టికల్చర్ అధికారుల హెచ్చరికలు



హార్టికల్చర్ ఆఫీసర్ రామక్రిష్ణ



మైదుకూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పసుపు పంటకు ఆకుమచ్చ తెగుళ్ల ఆశిస్తాయని.. రైతులు అప్రమత్తంగా ఉండి పలు జాగ్రత్తలు తీసుకోవాలని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు. వారి వివరాల మేరకు... మైదుకూరు నియోజకవర్గంలో ప్రధాన వాణిజ్య పంట పసుపు పంట. ఈ ఏడాది మైదుకూరు మండలంలో సుమారు 1120 ఎకరాలు, దువ్వూరులో 700 ఎకరాలు, ఖాజీపేటలో 527 ఎకరాలు, చాపాడులో 331 ఎకరాలలో రైతులు పసుపు పంటను సాగు చేశారు.

వర్షాకాలంలో పసుపు పంటలో ముఖ్యంగా ఆకుమచ్చ, తాటాకు తెగుళ్ల ఆశిస్తాయని చెబుతున్నారు. ఈ తెగుళ్ల సోకినపుడు పసుపు పంటలో ఆకులకు మచ్చలు ఏర్పడతాయని... పట్టించుకోక పోతే పంట పూర్తిగా నాశనం అయ్యే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. దీని నివారణకు ఎకరాకు కార్బెండజిమ్ ఒక గ్రాము లేదా మ్యాంకోజెబ్ 3 గ్రాములు లేదా ప్రొపికాన్‌జోల్ ఒక ఎంఎల్ లేదా డైపెన్కోన్‌జల్ ఒక ఎంఎల్ లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు మార్చి మార్చి పిచికారి చేయాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా వర్షాలు తగ్గిన వెంటనే రెండు లేదా మూడు సార్లు పొటాషియం నైట్రేట్ 13-0-45 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాములు లీటరు నీటితో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని తెలిపారు.

అధికారుల సూచనల మేరకే...

పసుపు పంటను పండించే రైతులు వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పసుపు పంటకు ముఖ్యంగా ఆకుమచ్చ, తాటాకు తెగుళ్ల వ్యాపిస్తాయి. రైతులు ఏవైనా సందేహాలు ఉంటే మమ్మల్ని సంప్రదించవచ్చు. అధికారుల సూచనల మేరకు మాత్రమే పురుగు మందులను వాడాలి. ఎక్కువ మోతాదులో పిచికారి చేస్తే పంటలు నాశనం అవుతాయి.

- రామక్రిష్ణ, హార్టికల్చర్ అధికారి

రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి : జేడీ



గోడౌన్‌లో శనగ విత్తనాల నాణ్యతను పరిశీలిస్తున్న జేడీఏ

కొండాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్య మైన విత్తనాలు సరఫరా చేయాలని జిల్లా సంయుక్త వ్యవ సాయ సంచాలకులు (జేడీఏ) బి.చంద్రనాయక్ డీలర్లను ఆదేశించారు. కొండాపురంలోని విత్తన సరఫరా గోడౌన్‌లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా గోడౌన్‌లలో శనగ విత్తనాల నాణ్యతను పరిశీలించి, రికార్డుల ను తనిఖీ చేశారు. రాబోయే రబీ సీజన్‌కు రైతులకు అవసరమైన విత్తనాలను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని మిల్లు యజమానులను ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లో శనగ విత్తనాల సరఫరా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ నెల 25లోపు రైతు సేవా కేంద్రంలో రైతులు పంట నమోదు చేయించు కోవాలని తెలిపారు. బీడు భూములకు కూడా పంట నమోదు తప్పనిసరిగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా లావనూరు గ్రామంలో సాగుచేసిన శనగ పంటను, ఈ క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ రామమోహన్‌రెడ్డి, ఏవో రామాంజులరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయ వనరులను సమీకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో రాజ్యలక్ష్మి

కడప రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పరిధిలో ఆదాయ వనరులను సమీకరించుకొని తద్వారా పల్లెసీమల ప్రగతికి బాటలు వేయాలని పంచాయతీశాఖ జిల్లా అధికారి (డీపీవో) రాజ్యలక్ష్మి, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యంలు పేర్కొన్నారు. మంగళవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో గ్రామ పంచాయతీ సొంత ఆదాయ వనరుల సృష్టి అనే అంశంపై ఎంపీడీవోలకు, డిప్యూటీ ఎంపీడీవోలకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెసీమల ప్రగతికి ప్రభుత్వం ప్రముఖ ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ పరిధిలోని వనరుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకొని తద్వారా పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. సొంత భవనాలు, ఇంటిపన్ను, నీటి వినియోగపు చార్జీలు, వారాంతపు సంతలు, జీవాల సంతలు, జంతు వధశాలల నిర్వహణ, ట్రేడ్ లైసెన్సుల జారీ, పరిశ్రమలు, ఫ్యాక్టరీల ద్వారా పన్నులు తదితర వాటి ద్వారా ఆదాయాన్ని సమకూర్చి అభి వృద్ధి పనులను చేపట్టాలన్నారు. అలాగే గ్రా మ పంచాయతీల స్థిరమైన వనరుల సృష్టికోసం ఆదాయ అంచనా, ప్రణాళిక, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, నైపుణ్యాల ప్రాముఖ్యత తదితర వాటిని వివరించారు. ఇతర రాష్ట్రాలలో సొంత ఆదాయ వనరుల సమీకరణలో సాధించిన ప్రగతిని తెలియజేశారు. పంచాయతీలోని ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు.డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, ట్రైనింగ్ మేనేజర్ సురేష్, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

వాయు కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు : కలెక్టర్



వాయు కాలుష్య నియంత్రణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో వాయు కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వాయు కాలుష్య నియంత్రణ అమలుపై సమావేశం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు దేశంలోని వాయుకాలు ష్యం కలిగిన 132 నగరాలలో కాలుష్య నియంత్రణకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. వాటిలో కడప నగరం ఒకటని, ఈ ప్రాంతంలో వాయు కాలుష్యం వ్యాపించడంపై మూల కారణాలు తెలుసుకొని, నియంత్రించేందుకు అవసరమైన కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్య నియంత్రణకు నగరంలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. వాహనాల ద్వారా కాలుష్యం వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో వాయు కాలుష్యం వ్యాప్తి చెందే ముఖ్యమైన ప్రాంతాలను గుర్తించి నియంత్రణకు చర్యలు తీసు కోవాలన్నారు. నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వాయు కాలుష్య నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నగరంలో వాయు కాలుష్య పర్యవేక్షణకు ఆరు ఆపరేటింగ్ స్టేషన్లు పనిచేస్తున్నాయన్నారు. అనంతరం కడప కాలుష్య నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో రూపొందించిన దివాలీ ఏకో ఫ్రెండ్లీ గిఫ్ట్ పోస్టర్స్‌ను కలెక్టర్ అధికారులతో కలసి ఆవిష్కరించారు, కార్యక్రమంలో నగర కమిషరు మనోజ్‌రెడ్డి, పర్యావరణ ఇంజనీరింగ్ అధికారి సుధా కురుభ, కార్పొరేషన్ ఎస్ఈ చెన్న కేశవరెడ్డి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా రీ సర్వే చేపట్టాలి



రాఘవాపురం గ్రామంలో భూముల రీసర్వేని పరిశీలిస్తున్న శ్రీనివాసులరెడ్డి

ముద్దనూరు/మైదుకూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సెంట్రల్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ముద్దనూరు మండలంలోని కొత్తపల్లె, వేల్పుచర్ల గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న ఫేస్-3 భూముల రీసర్వేని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. వి.రాఘవాపురం గ్రామ పొలంలో చేపడతున్న రీసర్వేని పరిశీలించారు. రైతులకు రీసర్వేపై సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం కొత్తపల్లె గ్రామ సచివాలయంలో డివిజన్ పరిధిలోని మండల, గ్రామ సర్వేయర్లతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు ఇచ్చారు. అసిస్టెంట్ డైరెక్టర్ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పుల్లయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కె.హరి, డీటీ వరదకిశోర్ రెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.

రైతులతో సమావేశం

మైదుకూరు మండలంలోని శివపురంలో జరుగుతున్న రీసర్వే పనులను సెంట్రల్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ పరిశీలించి రైతులతో నేరుగా విచారించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రీ సర్వేకు వస్తున్నాం అని ఒక రోజు ముందు మాత్రమే రెవెన్యూ అధికారులు నోటీసులు ఇస్తున్నారని ఫిర్యాదు చేశారు. రీసర్వేకి కొంత సమయం ఇవ్వాలని కోరారు. అనంతరం ఆయన రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

నేడు టపాసుల దుకాణాలకు లాటరీ

కడప కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా నగర పరిధిలో బాణా సంచా దుకాణాల ఏర్పాటుకు బుధవారం సాయంత్రం 6 గంటలకు కడప ఆర్డీవో కార్యాలయంలో లాటరీ పద్ధతిలో దుకాణాల కేటా యింపు చేస్తామని ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. బాణాసంచా దుకాణాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న నిర్వాహకులందరూ పాల్గొనాలని ఆర్డీవో ప్రకటనలో కోరారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

కడప నాగరాజుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల కోసం ఈనెల 16వ తేదీ ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు విద్యుత్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యుత్ అదాలత్‌లో తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ (విశ్రాంతన్యాయమూర్తి) హాజరవుతారన్నారు. దీర్ఘకలికంగా ఉన్న సమస్యలు, ప్రత్యేక అదాలత్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు చిన్నచౌక్ పోలీసుల తెలిపారు. సుబ్బరాయుడు అనే వృద్ధుడు అదే ప్రాంతానికి చెందిన ఎనిమిది సంవత్సరాల బాలిక ఇంటి వద్ద ఆడుకుంటుండగా ఇంట్లోకి పిలిచి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక భయపడి కేకలు వేయడంతో బంధువులు అక్కడికి వచ్చి రక్షించారు. ఈ మేరకు చిన్నచౌక్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

కులంపేరుతో దూషించిన వ్యక్తిపై..

కడప క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప నగరం శంకరాపురంలో విజయ్‌కుమార్ అనే వ్యక్తిపై దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించిన ఒకరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. సీఐ వివరాల మేరకు శంకరాపురానికి చెందిన విజయ్‌కుమార్ సమీపంలో ఉన్న అక్కిశెట్టి వెంకట్ మంగళవారం చిన్న విషయమై గొడవ పడ్డారు. దీంతో విజయ్‌కుమార్‌ను వెంకట్ కొట్టడంతో పాటు కులం పేరుతో దూషించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం కైవసం



శ్యాం కార్తికేయను అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 69వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో పోటీల్లో ప్రొద్దుటూరుకు చెందిన శ్యాంకార్తికేయ బంగారు పతకాన్ని కైవసం చేసుకుని మొదటిస్థానంలో నిలిచారు. ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు గుంటూరు సమీపంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించినట్లు తైక్వాండో కోచ్ రాజేష్ తెలిపారు. ఈ పోటీల్లో అండర్-21 వెయిట్ కేటగిరిలో 6వ తరగతి చదువుతున్న శ్యాం కార్తికేయ ప్రతిభను కనబరచి గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. న్యాగల్యాండ్‌లో జాతీయస్థాయిలో జరుగబోయే నేషనల్ స్కూల్‌గేమ్స్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

సివిల్స్, గేట్ ఉచిత శిక్షణకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు యూపీఎస్సీ ద్వారా నిర్వహించే సివిల్స్ పరీక్ష, ఇంజనీరింగ్ ద్వారా నిర్వహించే గేట్ పరీక్ష ఉచిత శిక్షణకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌కు చెందిన కోనం ఫౌండేషన్ ద్వారా ఉచిత శిక్షణతో పాటు ఫెలోషిప్ అందిస్తారని డైరెక్టర్ తెలిపారు. ఇటీవల ఫౌండేషన్ ద్వారా ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఏస్ ఇంజనీరింగ్ విద్యాసంస్థ ద్వారా గేట్ పరీక్షకు ప్రవేశపరీక్ష నిర్వహించగా సివిల్స్‌కు సంబంధించి 9 మంది, గేట్ పరీక్షకు 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారని డైరెక్టర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఫౌండేషన్ ద్వారా ఉచిత శిక్షణతో పాటు ఫెలోషిప్ ఇస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఉన్నత ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు.

ఎల్ఎల్‌బీ పరీక్షల తనిఖీ



పరిశీలిస్తున్న వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో జరుగుతున్న లా సెమిస్టర్ పరీక్షలను నూతన ఉపకులపతి ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ మంగళవారం తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల గురించి చీఫ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ జి.కాత్యాయని వివరించారు. ప్రస్తుత పరీక్షకు 503 మంది హాజరయ్యారని, 67 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వీసీ వెంటకంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు ఉన్నారు. పరీక్షల విధుల్లో పరీక్షల అబ్జర్వర్ డాక్టర్ గణేష్‌నాయక్, సహాయ పరీక్షల అధికారులు డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్, డాక్టర్ మునికుమార్, సిబ్బంది, పి.చంద్రమౌళి పాల్గొన్నారు.

రాయలసీమ సమస్యలను ప్రస్తావించాలి

● కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి బహిరంగసభలో రాయల సీమ సమస్యల గురించి ప్రస్తావించాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర విభజన సమయంలో రాయలసీమకు అన్యాయం జరిగిందన్నారు. రాయలసీమకు హక్కుగా రావాల్సిన అన్నింటిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, కడపకు సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం, రాయల సీమ సమగ్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని నిధులు కేటా యించాలన్నారు. కడప, రాయచోటి, మదనపల్లె, బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైల్వే నిర్మాణాన్ని పూర్తి చేయించాలని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు.

రేపు గండి దేవస్థానంలో టెండర్లు

చక్రాయపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో ఈనెల 16వ తేదీ సాయంత్రం టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. దేవస్థానంలో శుభకార్యక్రమాలకు పందిళ్లు, ఎలక్ట్రికల్, పూల డెకరేషన్లు, సప్లయర్స్ సామాన్లు సరఫరా చేసే హక్కుకు రూ.50వేలు ధరావత్తు చెల్లించి టెండర్‌లో పాల్గొనవచ్చ న్నారు. స్వామివారి అలంకరణకు గ్రామోత్సవంలో పూలమాలలు సప్లై చేసే హక్కుకు రూ.20వేలు ధరవాత్తు, అన్న దానం, అరిటాకుల సప్లై చేసుకునేందుకు, మామిడి, అరటి తోరణాలు, స్వామివారికి వస్త్రాలు సరఫరా చేసే హక్కుకు రూ.10వేలు ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చన్నారు. అలాగే ప్లంబింగ్ సామాన్లు కోసం, స్టేషనరీ, ఎల క్ట్రికల్ సామాన్లు సరఫరా చేసే హక్కు కోసం రూ.10వేలు, ప్రింటింగ్ పార్సల్, ఖాళీ నెయ్యి డబ్బాలు విక్రయించేందుకు రూ.5వేలు, పాదరక్షకులు భద్రపరుచుటకు రూ.5వేలు, ఇనుప, ప్లాస్టిక్ సామాన్లు, డబ్బాల విక్రయానికి సంబంధించి కూడా టెం డర్లు ఉంటటాయని, ఆసక్తి గల వారు 16వ తేదీ టెండర్లలో పాల్గొనాలని ఆయన కోరారు.

టెంకాయలు, తలనీలాల వేలంతో రూ.20 లక్షలు ఆదాయం

చాపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానంలో టెంకాయల విక్రయానికి, తలనీలాలు సేకరణకు సంబంధించి మంగళవారం వేలం నిర్వహించగా రూ.20,02,000 ఆదాయం వచ్చినట్లు ఆ దేవస్థానం చైర్మన్ పెరుగు వీరనారాయణ, ఈవో శంకర్‌బాలాజీ తెలిపారు. టెంకాయలు అమ్ముకునేందుకు కడపకు చెందిన వెంకట లక్ష్మి రూ.5.52 లక్షలకు, తలనీలాలు సేకరించుకునేందుకు బి.మఠంకు చెందిన రాజేష్ రూ.14.50 లక్షలకు వేలంపాడి దక్కించుకున్నట్లు వారు చెప్పారు. ఒక ఏడాది పాటు వారికి హక్కు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ డబ్బులను మైదుకూరులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో జమ చేసినట్లు పేర్కొన్నారు. ఈ వేలంపాటను ప్రొద్దుటూరు దేవదాయశాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆదరణ లేని వృద్ధురాలు బిడ్డల చెంతకు..



తల్లిని నిరాదరణకు గురిచేసిన కుమారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న జడ్జి

కడప రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆదరణ లేకుండా ఒంటరిగా జీవిస్తున్న వృద్ధురాలు బుసల లక్షుమ్మను డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ బిడ్డల చెంతకు చేర్చారు. కడప నగరం తారకరామ నగర్‌లో లక్షుమ్మ ఆదరణ లేకుండా ఒంటరిగా జీవిస్తున్నట్లు డీఎల్ఎస్ఏకు తెలిసిన వెంటనే జడ్జి స్పందించారు. ఈ మేరకు జడ్జి వృద్ధురాలితో మాట్లాడి నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నట్లు తెలుసుకున్నారు. బిడ్డలను డీఎల్ఎస్ఏకు రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కూతురు తమ వద్ద తల్లిని ఉంచుకోవడంతో పాటు పెద్ద కుమారుడు బుసల రమణ, రెండవ కుమారుడు బుసల చిన్నప్ప, మూడవ కుమారుడు బుసల చంద్రలు తల్లి లక్షుమ్మకు ప్రతి నెలా ఒక్కొక్కరు రూ.1500 ఇచ్చేలా ఒప్పుకున్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం గురించి జడ్జి తెలియజేశారు.

అరటి ధర పాతాళానికి!

● కోతకు ముందుకు రాని వ్యాపారులు ● చెట్లపైనే మాగుతున్న కాయలు ● ఆందోళనలో రైతులు

ఒంటిమిట్ట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏడాదిపాటు కష్టపడి సాగుచేసిన పంట తీరా చేతికొచ్చే సమయంలో ధర పతనం కావడంతో అరటి రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. మండలంలోని రైతులు సుమారు 150 ఎకరాల్లో అరటి పంటను సాగు చేశారు. ఒక ఎకరాలో అరటి సాగుకు రూ.60 వేల దాకా ఖర్చు, ఏడాది సమయం పడుతుంది. ఆశించిన దిగుబడులు వచ్చి బాగా వచ్చి, ధర అనుకూలంగా ఉంటే ఎకరాకు సుమారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఈ ఏడాది కోతకు వచ్చిన సమయంలో ధర కిలో రూ..3 నుంచి 4 రూపాయలకు పడిపోయింది. దీంతో కూలి, వాహన ఖర్చులు కూడా వచ్చే అవకాశం లేక పోవడంతో వ్యాపారులు కోతలకు ముందుకు రావడం లేదు. దీంతో చెట్లకే అరటికాయలు మాగిపోతున్నాయి. స్థానిక వ్యాపారులు సిండికేటుగా ఏర్పడి బయట నుంచి వ్యాపారులను రానివ్వకుండా అడ్డుకోవడమే ధరల పతనానికి కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు మహారాష్ట్ర నుంచి కాయలు కూడా ఎక్కువగా రావడంతో ఇక్కడి కాయలకు డిమాండ్ తగ్గినట్లు అయ్యింది. రైతుకు అపార నష్టం ఏర్పడింది. కళ్లముందరే పండిన పంట చెట్లకే మాగి రాలిపోతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


చెట్లపైనే మాగిపోయిన అరటి కాయలు

చెట్లపైనే మాగిపోతున్నాయి.



ఎంతో ఆశతో అరటి పంటను సాగు చేశాం. ధర లేకపోవడతో వ్యాపారులు ముందుకు రాక కాయలు చెట్లపైనే మాగిపోతున్నాయి.

- మోదుగుల లక్ష్మీనరసయ్య, రైతు

కళ్లెదుటే రాలిపోతున్నాయి



కళ్లెదుటే కాయలు రాలి పోతున్నాయి. దీంతో కడుపు తరుక్కు పోతోంది. ప్రభుత్వం అరటి రైతులను ఆదుకోవాలి.

- మామిళ్ల ఈశ్వరయ్య, రైతు

నేడు పుల్లంపేట మండల సమావేశం

పుల్లంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేట మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జయశ్రీ తెలిపారు. ఈ సమావేశంలో పారిశుధ్యం, తాగునీరు, ఉపాధిహామీ, పక్కా గృహాలు తదితర అంశాలపై సమీక్షిస్తామని ఆమె తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

నవంబరు 23న భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు

రాజంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నవంబరు 23న ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ డాక్టర్ టి.గోపిబాబు, ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు భగవద్గీత 14వ అధ్యాయంలోని గుణత్రయ విభాగయోగం, 10వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులను 16వ అధ్యాయం దైవాసుర సంపద్విభాగయోగం పఠన పోటీలు ఉంటాయన్నారు. 18 నుంచి 45 ఏళ్ల వయసు వారికి నిత్యజీవితంలో భగవద్గీత - భావ విశ్లేషణ అనే అంశంపై వక్తృత్వ పోటీ ఉంటుందన్నారు. ప్రతి విభాగం నుంచి ప్రథమ రూ.1116, ద్వితీయ 816, తృతీయ 516 రూపాయలు బహుమతులు ఉంటాయన్నారు. కావున అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా చూడాలని కోరారు. మరిన్ని వివరాలకు 9110779066 సంప్రదించాలని కోరారు.

అన్నమాచార్య విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి గౌరవం

రాజంపేట టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో ఈసీఈ చదువుతున్న విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో గౌరవం దక్కింది. పంజాబ్ రాష్ట్రంలోని ండీగఢ్ ఇంజనీరింగ్ కాలేజీలో సీజీసీ లాండ్రన్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో 6వ అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విద్యార్థులు కొట్టే గణేష్, పోలుబోయిన అనిత, కలకడ భవిత ఎఫిషియెంట్ అండ్ లైట్‌వెయిట్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ కాన్ఫిడెన్షియల్ మెడికల్ ఇమేజ్ డయాగ్నోసిస్ యూజింగ్ ఎడ్జ్ ఏఐ అనే పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఇందుకు ఉత్తమ పత్రం అవార్డు లభించడం జరిగింది. ఈ పరిశోధనకు డాక్టర్ జి.తిరుమలయ్య మార్గదర్శకత్వం వహించారు. అవార్డు రావడం అన్నమాచార్య విశ్వవిద్యాలయానికే గర్వకారణమని వైస్ ఛాన్సలర్ ఈ సాయిబాబారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ, విభాగాధిపతి డాక్టర్ జె.చిన్నబాబువిద్యార్థులను అభినందించారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

●ఎక్సైజ్ ఎస్ఐ మహమ్మద్

గాలివీడు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్ఐ మహమ్మద్‌అలీ హెచ్చరించారు. మంగళవారం నూలివీడు, గాలివీడులో దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను రూపొందించిందని తెలిపారు. మద్యం కొనుగోలుదారులు తప్పనిసరిగా బాటిల్‌ను సరి చూసుకోవాలని, షాపులో డ్యూటీలో ఉన్న వ్యక్తి ప్రతి బాటిల్‌ను స్కాన్ చేసి ఇవ్వాలని, వారి మొబైల్ ఎప్పుడూ ఆన్‌లో ఉంచుకోవాలని సూచించారు. అనుమానం కలిగితే వెంటనే 14405 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

టమోటా రైతులకు న్యాయం చేయాలి


మాట్లాడుతున్న వంగిమళ్ల రంగారెడ్డి

రాయచోటిటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): టమోటా రైతులను దగా చేస్తున్న మండీల యజమానులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సీపీఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గుర్రకొండ టమోటా మార్కెట్‌లో మండీల యజమానులు రైతులను దగా చేస్తున్నారని చెప్పారు. రైతులు 100 టమోటా బాక్సులను మార్కెట్‌కు తీసుకెళ్తే అందులో 20 బాక్సులను జాక్‌పాట్ కింద తీసేస్తున్నారని చెప్పడతో రైతు సంఘం నేతలు అక్కడికి వెళ్లి విచారణ చేయగా, ఈ రోజు మీ వెంట వస్తే మరుసటి రోజు మా మండీలకు రావద్దు మీరు ఇష్టానుసారంగా అమ్ముకోండి అని తమను ఇబ్బందులకు గురిచేస్తారని రైతులు భయపడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాయచోటి ఏరియా అధ్యక్షుడు హరినాథ్‌నాయుడు, కౌన్సిల్ సభ్యులు అంజద్ అలీఖాన్, రామాపురం మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి షబ్బీర్‌బాషా, రామాపురం మండల సీపీఐ కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అడపలమాలపల్లెలో కనీస వసతులు కల్పించాలి


గ్రామస్తులతో సీపీఐ నేత సిద్దిగాళ్ల శ్రీనివాసులు

రామాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడపల మాలపల్లెలో కనీస వసతులు కల్పించాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మర్రి సుమిత్ర డిమాండ్ చేశారు. మంగళవారం దళితవాడలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ అడపల మాలపల్లెలో దాదాపు 35 కుటుంబాలు నివసిస్తున్నారోడ్డు సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. చిన్నపిల్లలను స్కూల్‌కు పంపించేందుకు తల్లిదండ్రులు పనులు మానుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు , డ్రైనేజీ, తాగునీటి సదుపాయం, అంగన్వాడీ కేంద్రం, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. లేని పక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న పశువుల వ్యాపారం


అన్నంపొట్లాలు పంపిణీ చేస్తున్న ఎస్ఎండీ షఫీనాయక్

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గత మంగళవారం లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డులో ప్రారంభమైన పశువుల సంత ఊపందు కుంది. అధిక సంఖ్యలో వ్యాపా రులు తరలివచ్చారు. రైతుల సౌకర్యార్థం మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్ఎండీ షఫీనాయక్ మార్కెట్ యార్డుకు వచ్చిన ప్రతి రైతుకు తాగునీరు, భోజన వసతి కల్పించారు. ఇలాగే ప్రతి వారం రావాలని ఆయన రైతులను కోరారు. మార్కెట్ యార్డు సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో అప్రమత్తంగా ఉండండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రవీంద్రనాయక్

సుండుపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమని ఎంఈవో రవీంద్రనాయక్, ప్ర ధానోపా ధ్యాయు రాలు జక్రియాబేగం తెలిపారు. మంగళవారంమండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై పిల్లలకు అవగాహన కల్పించారు. పిల్లలు సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిధ యాప్‌ల ద్వారా కేంద్ర, రాష్ట్రల ప్రభుత్వ పథకాలు జన సురక్ష పీఎం విశ్వకర్మ యువజన ముద్రలాంటి పథకాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరికీ ఓటీపీలు చెప్పకూడదని అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయరాదని సూచించాంచారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం


ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదామని ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్టు మేనేజర్ స్వాతి పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణం నారాయణ పాఠశాలలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య సేవా సంఘం ఎయిడ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సునుద్దేశించి ఆమె మాట్లాడు తూ అన్నిశాఖల అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు ఎయిడ్స్ మహమ్మారి నివారణకు ప్రజలను చైతన్యవంతులు చేయాలని కోరారు. ప్రిన్సిపాల్ ఖాదర్‌వలి, ఏజీఎం శంకర్‌రెడ్డి, ప్రజా చైతన్య సేవా సంఘం ఏఎన్ఎం ప్రవీణ, ఓఆర్‌డబ్ల్యూ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పంచాయతీ విభజనపై అభిప్రాయ సేకరణ


మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ మెహతాజ్‌యాస్మిన్

సిద్దవటం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టక్కోలి గ్రామ పంచాయతీని రెండు పంచాయతీలుగా విభజించాలంటూ వచ్చిన అభ్యర్థనపై మంగళవారం ఆ గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచ్ పోలుబోయిన లక్ష్మీదేవి అధ్యక్షతన అభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. టక్కోలి పంచాయతీలోని బీసీ, ఎస్సీ కాలనీలను ఒక గ్రామపంచాయతీగా, ఖాజీపల్లె, డేగనవారిపల్లె, పాత టక్కోలి గ్రామాలు కలిసి వేరొక పంచాయతీగా ఏర్పాటు చేయాలంటూ గత ఏడాది డిసెంబరు 23న బాలసుబ్రమణ్యం అనే వ్యక్తి పంచాయతిరాజ్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో ఈ ప్రతిపాదనకు అనుకూలంగా ముగ్గురు, వ్యతిరేకంగా 63 మంది సంతకాలు చేశారు. ఈ విషయంపై కడప డీపీఓకు నివేదిక సమర్పి స్తామని మండల విస్తరణాధికారి మెహతాజ్‌యాస్మిన్ తెలిపారు. ఎస్ఐ మహమ్మద్‌రఫీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్పంచ్ లక్ష్మీదేవి, పంచా యతి సెక్రటరీ రామలింగారెడ్డి, ఎంపీటీసీ సభ్యు రాలు సుబ్బమ్మ, టీడీపీ కార్యదర్శి నాగమునిరెడ్డి, వైసీపీ నేత కన్వీనర్ నీలకంఠారెడ్డి కూట మి నేత నిమ్మకాయల జగన్‌మోహన్‌రెడ్డి, సాంబశివారెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాలికా సంరక్షణపై అవగాహన ర్యాలీ


ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ రాధిక తదితరులు

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్యా, సామాజిక ఎదుగుదలపై అవగాహన అవసర మని జిల్లా టీబీ, లెప్రసీ అధికారి డాక్టర్ రాధిక తెలిపారు. మంగళవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ర్యాలీలో పాల్గొన్నారు. గవర్నమెంట్ జూనియర్ కాలేజీ నుంచి బంగ్లా వరకు అధికారులు అంగన్వాడీ సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల పట్ల అసమానత్వం, చిన్నచూపు, లింగ వివక్ష తగదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు, జిల్లా డెమో అధికారి దేవశిరోమణి, సూపర్‌వైజర్ నూర్జహాన్, సీహెచ్‌వో నారాయణ, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయిస్తాం'


మదన్‌మోహన్‌కు సమస్య తెలుపుతున్న బాలాజీనగర్‌కాలనీ వాసులు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రవీంద్రనగర్ కాలనీలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న 52 కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని మండల టీడీపీ అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్ హామీ ఇచ్చారు. మంగళవారం ఆ ప్రాంతాన్ని ఆయన సం దర్శించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ గత ప్రభు త్వంలో ఎన్నో ఆశలు పెట్టి మోసాలు చేశారని, రాత్రివేళలో పాములు, పురుగులు, వర్షం వస్తే బురదలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వివరించారు. ఈ విషయాన్ని ఫోన్‌ద్వారా మంత్రి మండిపల్లి దృష్టికి తీసుకెళ్లడంతో, తహసీల్దార్‌తో మాట్లాడి, స్థలాలు గుర్తించి ఇళ్లు నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. ఇళ్ల నిర్మాణంతో పాటు ఆ కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు ఆంజనేయులు, పెద్దరెడ్డెయ్య, కిట్టు, రమ్య, కొలిమి పక్కీరయ్య, రెడ్డిశేఖర్, సయ్యద్ మసూద్, అన్వర్, బాబు, ఓబులేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు కోడూరు విద్యార్థులు

రైల్వేకోడూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్, క్రికెట్, కబడ్డీ పోటీలకు రైల్వేకోడూరు ఎస్వీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎన్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఈ నెల 8న పోరుమామిళ్లలో నిర్వహించిన అండర్-19 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలు. 12న రైల్వేకోడూరులో కబడ్డీ, క్రికెట్, 13న చిన్నమండెంలో వాలీబాల్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు రాణించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిచారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, పీఈటీ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు.. పోషకాహారం అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న సరళాదేవి

రైల్వేకోడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే పిల్లలకు విద్యతోపాటు, పోషకాహారం అందించాలని రైల్వేకోడూరు ఏసీడీపీవో సరళాదేవి సూచించారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల సందర్భంగా మంగళవారం తహసీల్దార్ కార్యాలయం సభాభవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యమైన మహిళ, శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాది అని తెలిపారు. చిన్న పిల్లలకు ఆహారపు అలవాట్లు, పద్ధతులు నేర్పించాలని తెలిపారు. పోషణ, సంరక్షణలో పురుషుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలన్నారు. సమన్వయ చర్యలు, డిజిటలీకరణ ద్వారా సమగ్ర పోషణకు బలమైన అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'రెడ్డివారి పల్లెలో ఆగిన అభివృద్ధి'

రైల్వేకోడూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరగని కారణంగా అభివృద్ధి ఆగి పోయిందని మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్ తెలిపారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రెడ్డివారిపల్లె పంచాయతీలో ఉన్న గుండాలపల్లెను విడ దీసి ప్రత్యేక పంచాయతీ చేశారని తెలిపారు. ఈ విషయంపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఎన్నికలు ఆగిపోయినట్లు తెలిపారు. దీంతో ఐదేళ్లుగా రెడ్డివారిపల్లె పంచాయతీలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పారిశుధ్యం అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాల ఆవరణలో స్వచ్ఛభారత్


పాఠశాల ఆవరణను శుభ్రం చేయిస్తున్న బండారు మల్లికార్జున

రైల్వేకోడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అనంతరాజుపేట ఎంపీటీసీ సభ్యుడు బండారు మల్లికార్జున ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణ లో ఉన్న పిచ్చిమొక్కలు తదితరాలను తొలగించారు. క్రీడా మైదానాన్ని శుభ్రం చేయించారు.

మార్కెట్ యార్డులో టమోటా, మామిడి విక్రయించాలి

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాయచోటి మార్కెట్ యార్డులో టమోటా, మామిడి కాయల విక్రయాలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యుడు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి మంగళవారం ఒక పత్రిక ద్వారా విజ్ఞప్తి చేశారు. రాయచోటి ప్రాంతంలో మామిడి వ్యాపారుల సిండికేట్‌కు గండికొట్టాలన్నారు. గుర్రంకొండ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానం రద్దు చే యాలని విజ్ఞప్తి చేశారు. చ ౦. అన్నమయ్య జిల్లా కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవతో రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ బోధనతోనే ఉపాధ్యాయులకు గౌరవం


బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

రాయచోటి - నేతాజీ సర్కిల్ , అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ బోధనలతోనే ఉపాధ్యాయులకు గౌరవం లభిస్తుందని ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సంబేపల్లె మండలం రెడ్డిమల్లువారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన కృష్ణయ్య బదిలీపై వెళ్తున్న సందర్భంగా గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణయ్య సేవలను గుర్తించి గ్రామస్తులు ఇంత పెద్ద ఎత్తున సన్మానించడం గొప్ప విషయమన్నారు. విధి నిర్వహణలో ఉపాధ్యాయుల అంకితభావం గ్రామస్తుల మనసు చూరగొంటుందనడానికి ఇది ఒక నిదర్శనమన్నారు. ఎనిమిదేళ్లు ఈ పాఠశాలలో పనిచేసిన ఆయన తప్పనిసరి బదిలీపై చిన్నమండెం మండలం కావలివాండ్లపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారన్నారు. విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయడంలోనూ, పాఠశాలలో మౌలిక వసతుల అభివృద్ధిలోనూ కృష్ణయ్య కీలకపాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబులేరెడ్డి, ఉపాధ్యాయులు బాలాజీ, నాగరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్‌కు క్రీడాకారుల సన్మానం


డీఎస్‌ఓను సన్మానిస్తున్న హాకీ క్రీడాకారులు

రాయచోటి టౌన్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా డీఎస్‌డీవోగా సోమవారం బాధ్యతలు తీసుకున్న చంద్రశేఖర్‌కు రాయచోటి లోని రాజు విద్యాసంస్థల వద్ద హాకీ మైదానంలో అన్నమయ్య జిల్లా హాకీ కార్యదర్శి ఇడగొట్టు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులతో పాటు, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. హాకీ అకాడమీ ఫౌండర్ సీఐ చంద్రశేఖర్, జిల్లా హాకీ సెక్రటరీ ఇడగొట్టు నాగేశ్వరరావు, ఖదీరుల్లాఖాన్ సహకారం మరువలేనిదన్నారు. మా హాకీ కోచ్ మాకు డీఎస్‌డీవోగా రావడం చాలా సంతోషంగా ఉందని హాకీ ఆటగాళ్లు, మరి కొంత మాజీ క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు.

ఓట్ చోరీపై సంతకాల సేకరణ

వీరబల్లి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో అవకతవకలను నిరసిస్తూ ఏఐసీసీ నిర్వహిస్తున్న ఓట్ చోర్ గద్దిచోడ్ ఉద్యమంలో భాగంగా మండల కేంద్రంతోపాటు ఈడిగపల్లిలో కాంగ్రెస్ నేతలు మంగళవారం సంతకాలు సేకరించరు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డెయ్యరాజు, నాయకులు దుగ్గనపల్లి సురేంద్రారెడ్డి, కంపా జనార్దన్, కాల్వపల్లి భాస్కర్, తాటిగుట్ల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ నిర్వహణపై ప్రజలకు అవగాహన

పెనగలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటు కారణంగా అపస్మారక స్థితిలోకి వెళ్లిన వారిని ప్రాణాపాయం నుంచి తప్పించేందుకు అనుసరించాల్సిన సీపీఆర్ విధానంపై బుధవారం ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల విద్యార్థులు కంబాలకుంట గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భాగంగా యూనిట్-1 విద్యార్థులు రెండో రోజు కార్యక్రమాల్లో కంబాలకుంట ప్రజలకు ఆరోగ్య సమస్యలు, పరిరక్షణపై అవగాహన కల్పించారు.

ఆదర్శపాఠశాలలో డీఈవో తనిఖీలు

పుల్లంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదిలోకి వెళ్లి ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని పరిశీలించారు. పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో క్వాలిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ లీలాశ్రీహరిని ఆదేశించారు. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మెనూ పరిశీలించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు చక్రధర్‌రాజు, నాగ తిరుమలరావు, ఎస్‌వో రూత్‌మేరి తదితరులు పాల్గొన్నారు.

'మద్యాన్ని నిత్యావసర సరుకుగా మార్చిన ఘనత వైసీపీదే..'

చిట్వేలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మద్యాన్ని నిత్యావసర సరుకుగా మార్చిన ఘనత వైసీపీదేనని జనసేన పార్టీ నాయకుడు మాదాసు నరసింహ ఆరోపించారు. మంగళవారం స్థానిక జనసేనపార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కల్తీ మద్యం విక్రయిస్తున్నారని, విచ్చలవిడిగా మద్యం దుకాణాలు కేటాయిస్తున్నారని పనికిరానికి విమర్శలు చేస్తూ వైసీపీ నేతలుకూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. 2019 నుంచి 2024 వరకు దశలవారీగా మద్యపాన నిషేధం చేస్తామని ఎన్నికల సందర్భంగా వైసీపీ అధినేత చేసిన వాగ్దానాలు వైసీపీ నాయకులు మరిచారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా వైసీపీ కుతంత్రాలను రాష్ట్ర ప్రజలకు తెలియపరిచేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు ప్రారంభించిందని, త్వరలో ఎవరెవరు ఈ కుట్రలకు పాల్పడ్డారో బట్టబయలవుతుంద న్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దిశ, దశ మార్చే నాయకులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ రియాజ్, పురం సురేష్, మద్దూరి మన్మధ, కోనిశెట్టి చక్రి, పెద్దంగారి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలకపక్షం పాపం..!

- స్వపక్షంలోనే విపక్షం.. అజెండా అంశాల రద్దు
- వరుస వాయిదాలతో ప్రజల బేజారు
- ముందుకు సాగని పనులు
- ముంచుకొస్తున్న ఎన్నికల గడువు

పట్టణాభివృద్ధికి ఆటంకం..

మదనపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పాలకవర్గం గడువు ఇక ఆరునెలల్లో ముగియనుంది. ఈ నాలుగున్నరేళ్ల వెనక్కి చూసుకుంటే, పట్టణంలో ఎక్కడా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని పాలకవర్గంలోని వైసీపీ కౌన్సిలర్లే బాహాటంగా చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలో నిధులు పుష్కలంగా ఉన్నా.. వాటినీ వినియోగించుకోవడంలో పాలకవర్గం విఫలమవుతోంది. స్వపక్షంలోనే విపక్షంలా రెండువర్గాలుగా విడిపోయి అటు అధికారులు, ఇటు తటస్థ కౌన్సిలర్లకు తలనొప్పిగా మారింది. కూటమి ప్రభుత్వ పాలనలో మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ తమను సంప్రదించకుండా స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల చెప్పినట్లు నడుచుకుంటున్నారని ఓ వర్గం ఆరోపిస్తోంది. ఈ క్రమంలో అప్పటివరకూ కొన్ని సమావేశాలు సవ్యంగా సాగినా... తర్వాత అడ్డంకులు, అవరోధాల మధ్య కౌన్సిల్ సమవేశాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో అజెండాలోని కొన్ని అంశాలు ఆమోదం పొందగా, మరికొన్ని పెండింగ్ పడుతుండగా, ఇంకొన్ని ఏకంగా రద్దుకు గురవుతున్నాయి.

ఇటీవల జరిగిన రెండు సమావేశాలను తీసుకుంటే అజెండాలోని కొన్ని అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పక్కన పెట్టేయగా, సెప్టెంబరు సమావేశంలోని అజెండాను పూర్తిగా వాయిదా వేశారు. ఇలా ఒకరికి మించి మరొకరు పంతాలు, పట్టింపులకు పోతూ అభివృద్ధి పనులు ఆగిపోవడానికి కారణమవుతున్నారు. అది సాధారణ సమావేశమైనా.. అత్యవసర సమావేశమైనా.. మున్సిపల్ పాలకవర్గం తీరు మాత్రం అంతే. మున్సిపల్ పాలకవర్గంలో ఒక టీడీపీ కౌన్సిలర్ మినహా మెజారిటీ స్థానం వారిదే. అయితే ఇరుపోటీల మధ్య ఇల్లు చెడా.. పైపోటీల మధ్య పల్లె చెడే అనే సామెతను గుర్తు చేస్తూ, అందులోని రెండువర్గాల వ్యవహార శైలి అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారనే విమర్శలకు తావిస్తోంది. గత నాలుగేళ్ల వైసీపీ పాలనలో ప్రజలే కాదు.. మున్సిపల్ పాలకవర్గం కూడా విసిగి వేసారి పోయింది. మున్సిపాలిటీలో అధికారం కౌన్సిల్‌దే అయినా.. స్థానిక ప్రజాప్రతినిధి జోక్యంతో అటు కౌన్సిలర్లు, ఇటు చైర్‌పర్సన్ కూడా నామమాత్రంగా మారారు. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపల్ పాలకవర్గంలోని కొందరు వైసీపీ కౌన్సిలర్లకు.. పట్టణాభివృద్ధిపై ఆశలు చిగురించాయి. ఇక పాలకవర్గానికి పూర్తిస్థాయిలో పట్టు ఉంటుందని, ఇక మిగిలిన ఏడాదిన్నరలోనైనా అభివృద్ధిని పరుగులు పెట్టించాలని భావించారు. అయితే వారు అనుకున్నట్లు ఆరునెలలు మాత్రమే పరిపాలన సవ్యంగా సాగగా, తర్వాత మళ్లీ మొదటికొచ్చినట్లయింది. వార్డులో అధికారం తమదే అయినా.. కౌన్సిలర్లకు ఏమాత్రం విలువ లేకుండా కూటమి నాయకులు వార్డుల్లో తమకు సమాంతరంగా ఇన్‌చార్జులను నియమించారని వాదన మొదలైంది. ఇక అధికారం కూటమిదే అయితే కౌన్సిల్ అజెండాలోని అంశాలనూ వారినే ఆమోదించుకోవాలని, తమతో పనేంటని వైసీపీ నిలదీస్తోంది. ఈ క్రమంలో చైర్‌పర్సన్ సిద్ధం చేసిన అజెండాలోని కొన్ని అంశాలను పక్కన పెట్టడం, తిరస్కరించడం మొదలు పెట్టారు. అక్కడి నుంచి మొదలైన వివాదం.. ఇప్పటి వరకూ కొనసాగుతూనే వుంది. తమ ప్రమేయం లేకుండా, తమను సంప్రదించకుండా వార్డుల్లో పనులు ఎంపిక చేశారని, అజెండాలో పెట్టారని కొందరు కౌన్సిలర్లు ఆక్షేపించారు.

ఈ అంశాలను పక్కన పెడితే, ఆగస్టు, సెప్టెంబరులో జరిగిన సాధారణ, అత్యవసర సమావేశాలు ఏమాత్రం ఫలితం ఇవ్వలేదు. ఇందులో ఒక సమావేశంలో అజెండా అంశాలను పక్కన పెట్టగా, మరో సమావేశంలో అజెండానే వాయిదా వేసేశారు. ఈ క్రమంలో పట్టణంలో ప్రధానమైన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలకు అడ్డుకట్ట పడింది. గత ప్రభుత్వంలో బిల్లులు సక్రమంగా రాగా, కాంట్రాక్టర్లు పనులు నిలిపేశారు. దీంతో తమ వార్డులో ఒక్క పనిచేయలేదని, చివరి రోజుల్లోనైనా కనీసం రోడ్డు, కాలువలు నిర్మిద్దామంటే, ఇలా పనులు అడ్డుకోవడం ఏంటని కొందరు కౌన్సిలర్లు మౌనంగా రోధిస్తున్నారు.



మదనపల్లె మున్సిపల్ కార్యాలయం

ప్రధాన సమస్యలు.. ఆగిన పనులు

వర్షాకాలంలో ప్రశాంత్‌నగర్, ఎ.వి.నాయుడు కాలనీ, సప్తగిరినగర్‌లను ముంచెత్తుతున్న వరద నీటిని దారి మళ్లించేందుకు రూ.1.75 కోట్లతో డ్రైనేజీ నిర్మాణానికి కౌన్సిల్ పరిపాలనా ఆమోదం తెలిపింది. తర్వాత టెండర్ దశ పూర్తయి పనులు ప్రారంభం కాగా, వివిధ కారణాలతో ఈ అంశాన్ని పక్కన పెట్టేయగా, పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రశాంత్‌నగర్ వాసులు కొన్నేళ్లుగా కోరుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని కదిరిరోడ్డు వెంబడి మార్కెట్‌యార్డు నుంచి ప్రశాంత్‌నగర్ మెయిన్ లైన్ వరకూ కాలువ నిర్మాణాన్ని ఓ వర్గం అడ్డుకోగా బ్రేక్ పడింది.

- నక్కలదిన్నెలో అమృత్ పథకం కింద రూ.1.30 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకు మంజూరైంది. గతంలో ప్రాథమికంగా వేసిన అంచనా, సాంకేతిక పరంగా మరో రూ.30 లక్షలు అవసరమని గుర్తించారు. ఇందుకు మున్సిపల్ సాధారణ నిధులు వెచ్చించాలని ప్రతిపాదించగా కౌన్సిలర్లు అడ్డుకున్నారు. ట్యాంకు నిర్మాణానికి ముందు ప్రతిపాదించినట్లే అమృత్ నిధులతోనే చేపట్టాలని, సాధారణ నిధులు కేటాయించవద్దని కొందరు ఆక్షేపించారు. అది ఇప్పటికిప్పుడు సాధ్యం కాకపోవడంతో చివరకు ఆ పనులే రద్దయ్యే పరిస్థితి ఏర్పడింది.

- మున్సిపాలిటీలోని లబ్ధిదారులకు పట్టణ శివారులో టిడ్కో ఇళ్లు నిర్మించారు. 1872 మందికి ప్లాట్లు కేటాయించారు. వీరిలో చాలామంది ఇప్పటికే అక్కడ నివాసం ఉంటున్నారు. ఎమ్మెల్యే పర్యటనలో భాగంగా అక్కడి స్థానికులు వీధిలైట్లు వేయాలని విన్నవించారు. దీంతో రూ.11లక్షల వ్యయంతో వీధిలైట్లు ఏర్పాటుకు అజెండాలో అంశాన్ని చేర్చారు. దీన్ని కౌన్సిల్ వ్యతిరేకించింది.

మండలంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన


రైతు భూ సమస్య గురించి వింటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఓబులవారిపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. దీంతో జిల్లా, మండల స్థాయి అధికారులు పరుగులు పెట్టారు. ఉదయం 11.10 గంటలకు చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీలోని కస్తూర్బాగాంధీ విద్యాలయానికి చేరుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతరం వారు విద్యాలయంలో తరగతి గదులు, వంటగదులు, బాత్‌రూములను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న కళాశాల భవనాలను పరిశీలించారు. అనంతరం బొమ్మవరం గ్రామ పంచాయతీలోని చప్పిడి రమేష్ బాబు, కేవీ ప్రసాద్, కె.వెంకటేష్, వాసు, ఎరికలయ్య రైతుల సాగులో ఉన్న ఉద్యానవన పంటలను జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ సుభాషిని, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు మండలాల హార్టికల్చర్ ఆఫీసర్ భాస్కర్‌ల ఆధ్వర్యంలో పరిశీలించారు. ముందుగా మామిడి, అరటి, బొప్పాయి, నన్నారి పంటల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా రైతు తిరుపయ్యనాయుడు తమ భూసమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు యామిని, ఆర్‌ఐ మల్లికార్జునరెడ్డి, ఎస్‌ఐ మహేష్, డీఈవో డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎల్.నాగయ్య, జీసీడీవో సుమతి, ప్రిన్సిపల్ రాజకుమారి, మండల విద్యాశాఖాధికారులు శివరామిరెడ్డి, రెడ్డెయ్య, టీడీపీ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బి.కమ్మపల్లె టీడీపీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

- రాష్ట్ర స్థాయిలో రెండు బంగారు పతకాలు

రైల్వేకోడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో జాతీయ స్థాయి పోటీలకు రైల్వేకోడూరు ప్రభుత్వ బాలికల హైస్కూల్ విద్యార్థులు కె.సంధ్యన, కె.నవ్య ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామయ్య మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 10, 11, 12 తేదీల్లో బాపట్ల జిల్లా పెట్బూరు మండలంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో వీరు పాల్గొని బంగారు పతకాలు సాధించారని తెలిపారు. అంతేకాక నవంబరులో పంజాబ్‌లో జరగబోవు జాతీయ స్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారని, రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీరామ అనే విద్యార్థి కాంస్య పతకాన్ని సాధించినట్లు వివరించారు. కాగా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు, కోచ్ శివాజీ అభినందించారు.


పతకాలు సాధించిన విద్యార్థులు

వడ్డీ వ్యాపారుల ఇంటిముందు హిజ్రా ధర్నా

- డబ్బు, బంగారు తీసుకుని మోసం చేశారంటూ ఆరోపణ

మదనపల్లె టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారుల ఇంటి ముందు ఓ హిజ్రా ధర్నా చేసిన విషయం మంగళవారం చోటు చేసుకుంది. డబ్బు బంగారు తీసుకోవడమే కాకుండా తనపై దాడికి దిగారని ఆరోపిస్తున్నారు. బాధితురాలి కథనం మేరకు... పట్టణంలోని గౌతమినగర్‌కు చెందిన స్వాతి (హిజ్రా) అనే తాను చీటీల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నానని, ఈ క్రమంలో తన స్నేహితురాలు చంద్రకళకు వడ్డీ వ్యాపారులు ఈశ్వర్, స్వర్ణలత వద్ద పూచీ పడి రూ.30 లక్షల వరకు అప్పు ఇప్పించానని తెలిపారు. అనంతరం తన స్నేహితురాలు ఐపీ పెట్టి వెళ్లిపోవడంతో పూచీ ఉన్న కారణంగా వడ్డీ వ్యాపారులు తనను నిలదీశారన్నారు. చేసేది లేక 2021 సంవత్సరం నుంచి వారికి ఫోన్‌పే ద్వారా నాలుగేళ్ల పాటు రూ.34 లక్షలు చెల్లించడంతో పాటు, వారి అకౌంటుకు రూ.8లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశానని ఆరోపించారు. ఇవే కాకుండా 600 గ్రాముల బంగారు, ఇంటి దస్తావేజులు కూడా వడ్డీ వ్యాపారులు తీసుకున్నారని, వాటిని తిరిగి ఇవ్వాలని కోరినా ఇవ్వడం లేదని తెలిపారు. కాగా మంగళవారం వడ్డీ వ్యాపారుల ఇంటి ముందు బాధితు లలో కలిసి ధర్నాకు దిగినట్లు తెలి పారు. ఇదిలా ఉండగా.. ఈ విషయమై తాను గత నెలలోనే టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, పోలీసులు తనకు న్యాయం చేయాలని కోరారు.


వడ్డీవ్యాపారుల ఇంటి ముందు ధర్నా చేస్తున్న స్వాతి, బాధితులు

పాత జీఎస్టీతో అమ్మితే ఫిర్యాదు చేయండి

- డ్వామా పీడీ వెంకటరత్నం



ర్యాలీ నిర్వహిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

ములకలచెరువు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పాత జీఎస్టీతో ఎక్కడైనా వస్తువులు, సరుకులు ఇతర వస్తువులు విక్రయిస్తే టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో మంగళవారం ఎన్డీఏ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై తంబళ్లపల్లె నియోజకవర్గ స్థాయిలో ప్రజలు, మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో ఒక్కో కుటుంబానికి దాదాపు రూ.15 వేలు ఆర్థిక లబ్ధి చేకూరుతోందన్నారు. అనంతరం సీఎల్‌ఆర్‌సీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నక్రిష్ణా, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

కలకడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోతువారిపల్లెలో భార్యభర్తలపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. పోతువారిపల్లె వాసైన నాగయ్య అదే గ్రామానికి చెందిన భాగ్యమ్మకు పాత కక్షలున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉన్న నాగయ్య, అతని భార్య రెడ్డెమ్మపై భాగ్యమ్మ, కుమారుడు కిశోర్ దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి

పుల్లంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంత సముద్రం పంచాయతీ పాపక్కగారిపల్లె గ్రామంలో మంగళవారం సాయంత్రం విద్యుత్ శాఖకు గురై రైతు చిన్నిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి(48) మృతిచెందాడు. వ్యవసాయ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వస్తుండగా మోటారు పనిచేస్తుందో లేదోనని చెక్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. విషయం తెలుసుకున్న గ్రామ ప్రజలు చంద్రమోహన్‌రెడ్డిని ఓ ప్రైవేటు వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు ప్రభుత్వ వైద్యులు నిర్ధారించారు. ఆయన సతీమణి లక్ష్మీదేవి జీవనోపాధికై ఇటీవల కువైత్‌కు వెళ్లింది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పిల్లలు చిన్నవారు కావడంతో కుటుంబ పోషణ ఎలా అని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుల్లంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


చంద్రమోహన్‌రెడ్డి(ఫైల్)

యువకుడు ఆత్మహత్యాయత్నం

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక బాధలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నిమ్మనపల్లెలో చోటు చేసుకుంది. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసుల వివరాల మేరకు.. నిమ్మనపల్లె మండలం, ముష్టూరు గ్రామం, ఎర్రప్పగారిపల్లెకు చెందిన శంకర కుమారుడు సత్యనారాయణ (30) బెంగళూరులో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ మంగళవారం ఉదయం గ్రామానికి వచ్చారు. ఇంతలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన యువకున్ని కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు నిమ్మ నపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


చికిత్స పొందుతున్న యువకుడు

పురుగుల మందు తాగి యువతి...


చికిత్స పొందుతున్న యువతి

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భర్త మందలించాడనే కారణంతో పురుగుల మందు తాగి భార్య ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, మోతీనగర్, రెడ్డెమ్మ పిండిమిషన్ వద్ద కాపురం ఉన్న షేక్ వసీం భార్య హినాక్ కౌసిర్ (27) భర్త మందలించాడని మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స చేసిన డాక్టర్లు మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతికి రెఫర్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అపస్మారక స్థితిలోకి మహిళ

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కుటుంబ కలహాల నేపథ్యంలో మదనపల్లె మండలం, మాలేపాడు పంచాయతీకి చెందిన భీమేశ్వర భార్య శారద (30) మంగళవారం ఇంట్లో పురుగుల మందు తాగేసింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను భర్త గమనించి వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ప్రజాసంఘాల నాయకులు

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓ పేద కుటుంబంపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మదనపల్లెలోని జైభీమ్ భారత్ పార్టీ జిల్లా నాయకుడు కోన భాస్కర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏఐటీయూసీ తంబళ్లపల్లె నియోజకవర్గ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి సలీంబాషలు స్థానిక పోలీసుస్టేషన్ వద్ద వారు మాట్లాడారు. రాపూరివాండ్లపల్లె పంచాయతీ నాగన్నకోటకు చెందిన గండికోట చిన్నప్ప కుమారుడు వెంకటేష్ లారీ డ్రైవర్‌గా ఉంటూ తమ కుటుంబాన్ని పోషించుకునేవాడన్నారు. ఇదే క్రమంలో ఈ నెల 8న వెంకటేష్ తన వృత్తి రీత్యా వెళ్లాడని, ఈ నేపథ్యంలో సదరు గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న మల్లిఖార్జున కుమారులు ఇంట్లో నిద్రిస్తున్న మహిళను తలుపు తట్టి నిద్ర లేపారు. తెలిసిన వారు కావడంతో ఆ మహిళ తలుపు తీసింది. వారు మంచినీళ్లు కావాలని కోరడంతో పాటు ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించారని తెలిపారు. దీంతో ఆ మహిళ మరుసటి రోజు ఇంటికి వచ్చిన తన భర్తకు జరిగిన విషయాన్ని చెప్పడంతో వెంకటేష్ ఆ ఇద్దరు యువకులను నిలదీశాడు. దీంతో ఆ యువకులు ఆవేశంతో ఊగిపోయి వెంకటేష్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి అక్కడి చికిత్సలు అందిస్తున్నారని తెలిపారు. కాగా ఇదే విషయమై వెంకటేష్ భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు పీటీఎం పోలీసులు కేసు నమోదు చేశారే కానీ వారిని అరెస్టు చేయకుండా కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రజాసంఘాలు ఆరోపించాయి. ఎస్‌ఐ అందుబాటులో లేకపోవడంతో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్‌తో ప్రజాసంఘాల నాయకులు మాట్లాడారు. దాడి చేసిన వారిని పోలీస్‌స్టేషన్‌లో ఉంచాలని వారు డిమాండ్ చేశారు.


పోలీసులతో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

వ్యాపారిపై టీడీపీ నేత దాడి

- చంపేస్తానంటూ బెదిరింపులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో వ్యాపారిని టీడీపీ నాయకులు చితక బాదిన సంఘటన పట్టణంలోని చిప్పిలి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, సురభికాలనీకి చెందిన మోహన్ మురళి హంద్రీనీవా కాలువ సమీపంలో 1997లో రైతు నుంచి 19 సెంట్లు స్థలాన్ని కొనుగోలు చేశాడు. ఇటీవల తన పొలం పక్కనే మదనపల్లెకు చెందిన టీడీపీ నాయకులు, మున్సిపల్ మాజీ చైర్మన్ కొడవలి శివప్రసాద్ కొంత భూమిని కొనుగోలు చేసి మోహన్ మురళికి చెందిన భూమిని అక్రమించడానికి ప్రయత్నం చేశారు. దీంతో పలుమార్లు ఘర్షణ పడ్డారు. తన రికార్డులు పక్కాగా ఉన్నాయని ఎంతచెప్పినా వారు వినిపించుకోలేదు. కాగా మోహన్ మురళి తన పొలంలో పనులు చేసుకొంటూ ఉండగా అక్కడికి చేరుకున్న కొడవలి శివప్రసాద్, అతని తమ్ముడు కరుణాకర్, తమ డ్రైవర్‌తో కలిసి మోహన్ మురళిపై దాడి చేసి పిడుగుద్దులు గుద్ది చితకబాదారు. మరోసారి పొలంలోకి వస్తే చంపేస్తామంటూ బెదిరించారు. తాను హార్ట్ పేషెంటు అంటున్నా వినకుండా దాడి చేసినట్లు బాధితుడు వివరించారు. స్థానికులు అడ్డుకుని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు మదనపల్లె తాలుకా పోలీసులు కేసును విచారిస్తున్నట్లు చెప్పారు.


చికిత్స పొందుతున్న వ్యాపారి

కోడిపందేలపై విస్తృత దాడులు

వాల్మీకిపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్పీ ధీరజ్ కనుబిల్లి ఆదేశాల మేరకు వాయల్పాడు మండలంలోని గండబోయనపల్లె గ్రామ పంచాయతీ మేకలవారిపల్లె అటవీ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం కోడి పందేలపై పోలీసులు డ్రోన్ కెమెరాలతో విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కోడి పందెం నిర్వహిస్తున్న ప్రాంతంలో 15మందిని అదుపులోకి తీసుకుని 18 ద్విచక్రవాహనాలు, నగదు రూ.24,200 స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో స్థానిక ఎస్‌ఐ చంద్రశేఖర్, వాల్మీకిపురం, నిమ్మనపల్లె, కలికిరి, కలకడ, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, జిల్లా ఎస్టీఎఫ్ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.


డ్రోన్ కెమెరాల దాడిలో పట్టుబడిన కోడిపందెం రాయుళ్లు

ఇరువర్గాల ఘర్షణ - కేసు నమోదు

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం, చీకలబైలు అడవిలో దర్గా నిర్మాణ విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. సోమవారం రాత్రి జెండాలు నాటుతుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. అటవీశాఖాధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చీకలబైలు గ్రామంలో అదే గ్రామానికి చెందిన కొందరి సహకారంతో అడవిలో స్థలం కబ్జా చేసి మదనపల్లెలోని కొందరు దర్గా నిర్మాణానికి సన్నాహాలు చేసి ముస్లిం జెండాలు నాటారు. అటవీశాఖాధికారిణి ఏబీవో ఉమా దర్గా నిర్మాణాన్ని అడ్డుకున్నారు. గ్రామస్థులు రోడ్డుపై దర్గా నిర్మించరాదని నిరసన చేపట్టారు. దీంతో వివాదం తారాస్థాయికి చేరింది. ఏబీవో ఉమా ఫిర్యాదు మేరకు మదనపల్లె తాలుకా పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

రుషివాటిక ఘటనపై విచారణ


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి లక్ష్మీనరసయ్య

బి.కొత్తకోట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టు పంచాయతీ గట్లపై నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలో గత నెల 7న జరిగిన ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి లక్ష్మీనరసయ్య మంగళవారం విచారణ చేపట్టారు. ఈ ఘటనలో పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న లక్కిరెడ్డిపల్లి మండలం కాలాడివాండ్లపల్లెకు చెందిన విద్యార్థి శేషాద్రిరెడ్డి కంటికి తీవ్రగాయమై కనుచూపు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ విషయమై బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో తమకు న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. పోలీసులు పాఠశాలలో, బాధిత విద్యార్థి నివాసంలో విచారణ చేపట్టారు. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఈ ఘటనపై స్పందించారు. ఘటనపై సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలంటూ వివిధ శాఖల అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం. జిల్లా వైద్యాధికారి లక్ష్మీనరసయ్య సంబంధిత పాఠశాలకు వెళ్లారు. కనుచూపు కోల్పోయిన విద్యార్థి శేషాద్రిరెడ్డి తోటి విద్యార్థులను, పాఠశాల సిబ్బందిని విచారించారు. తమ విచారణలో తెలిసిన వివరాలను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డా.శ్రీధర్, ప్రభాకర్, విజయలక్ష్మి, రెడెమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

పసుపు పంటకు.. తెగుళ్లు

● అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి ● సకాలంలో మందులు పిచికారి చేయాలి
● జాగ్రత్తలు పాటించకపోతే పంటంతా నాశనం ● హార్టికల్చర్ అధికారుల హెచ్చరికలు



హార్టికల్చర్ ఆఫీసర్ రామక్రిష్ణ

మైదుకూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పసుపు పంటకు ఆకుమచ్చ తెగుళ్లు ఆశిస్తాయని.. రైతులు అప్రమత్తంగా ఉండి పలు జాగ్రత్తలు తీసుకోవాలని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు. వారి వివరాల మేరకు... మైదుకూరు నియోజకవర్గంలో ప్రధాన వాణిజ్య పంట పసుపు పంట. ఈ ఏడాది మైదుకూరు మండలంలో సుమారు 1120 ఎకరాలు, దువ్వూరులో 700 ఎకరాలు, ఖాజీపేటలో 527 ఎకరాలు, చాపాడులో 331 ఎకరాలలో రైతులు పసుపు పంటను సాగు చేశారు.

వర్షాకాలంలో పసుపు పంటలో ముఖ్యంగా ఆకుమచ్చ, తాటాకు తెగుళ్లు ఆశిస్తాయని చెబుతున్నారు. ఈ తెగుళ్లు సోకినపుడు పసుపు పంటలో ఆకులకు మచ్చలు ఏర్పడతాయని... పట్టించుకోక పోతే పంట పూర్తిగా నాశనం అయ్యే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. దీని నివారణకు ఎకరాకు కార్బెండజిమ్ ఒక గ్రాము లేదా మ్యాంకోజేబ్ 3 గ్రాములు లేదా ప్రొపికాన్‌జోల్ ఒక ఎంఎల్ లేదా డైపెన్కొన్‌జల్ ఒక ఎంఎల్ లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు మార్చి మార్చి పిచికారి చేయాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా వర్షాలు తగ్గిన వెంటనే రెండు లేదా మూడు సార్లు పొటాషియం నైట్రేట్ 13-0-45 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాములు లీటరు నీటితో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని తెలిపారు.

అధికారుల సూచనల మేరకే...

పసుపు పంటను పండించే రైతులు వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పసుపు పంటకు ముఖ్యంగా ఆకుమచ్చ, తాటాకు తెగుళ్ల వ్యాపిస్తాయి. రైతులు ఏవైనా సందేహాలు ఉంటే మమ్మల్ని సంప్రదించవచ్చు. అధికారుల సూచనల మేరకు మాత్రమే పురుగు మందులను వాడాలి. ఎక్కువ మోతాదులో పిచికారి చేస్తే పంటలు నాశనం అవుతాయి.

\- రామక్రిష్ణ, హార్టికల్చర్ అధికారి

రేపు గండి దేవస్థానంలో టెండర్లు

చక్రాయపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో ఈనెల 16వ తేదీ సాయంత్రం టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. దేవస్థానంలో శుభకార్యక్రమాలకు పందిళ్లు, ఎలక్ట్రికల్, పూల డెకరేషన్లు, సప్లయర్స్ సామాన్లు సరఫరా చేసే హక్కుకు రూ.50వేలు ధరావత్తు చెల్లించి టెండర్‌లో పాల్గొనవచ్చ న్నారు. స్వామివారి అలంకరణకు గ్రామోత్సవంలో పూలమాలలు సప్లై చేసే హక్కుకు రూ.20వేలు ధరవాత్తు, అన్న దానం, అరిటాకుల సప్లై చేసుకునేందుకు, మామిడి, అరటి తోరణాలు, స్వామివారికి వస్త్రాలు సరఫరా చేసే హక్కుకు రూ.10వేలు ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చన్నారు. అలాగే ప్లంబింగ్ సామాన్లు కోసం, స్టేషనరీ, ఎల క్ట్రికల్ సామాన్లు సరఫరా చేసే హక్కు కోసం రూ.10వేలు, ప్రింటింగ్ పార్సిల్, ఖాళీ నెయ్యి డబ్బాలు విక్రయించేందుకు రూ.5వేలు, పాదరక్షకులు భద్రపరుచుటకు రూ.5వేలు, ఇనుప, ప్లాస్టిక్ సామాన్లు, డబ్బాల విక్రయానికి సంబంధించి కూడా టెం డర్లు ఉంటటాయని, ఆసక్తి గల వారు 16వ తేదీ టెండర్లలో పాల్గొనాలని ఆయన కోరారు.

టెంకాయలు, తలనీలాల వేలంతో రూ.20 లక్షలు ఆదాయం

చాపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానంలో టెంకాయల విక్రయానికి, తలనీలాలు సేకరణకు సంబంధించి మంగళవారం వేలం నిర్వహించగా రూ.20,02,000 ఆదాయం వచ్చినట్లు ఆ దేవస్థానం చైర్మన్ పెరుగు వీరనారాయణ, ఈవో శంకర్‌బాలాజీ తెలిపారు. టెంకాయలు అమ్ముకునేందుకు కడపకు చెందిన వెంకట లక్ష్మి రూ.5.52 లక్షలకు, తలనీలాలు సేకరించుకునేందుకు బి.మఠంకు చెందిన రాజేష్ రూ.14.50 లక్షలకు వేలంపాడి దక్కించుకున్నట్లు వారు చెప్పారు. ఒక ఏడాది పాటు వారికి హక్కు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ డబ్బులను మైదుకూరులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో జమ చేసినట్లు పేర్కొన్నారు. ఈ వేలంపాటను ప్రొద్దుటూరు దేవదాయశాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి : జేడీ



గోడౌన్‌లో శనగ విత్తనాల నాణ్యతను పరిశీలిస్తున్న జేడీఏ

కొండాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్య మైన విత్తనాలు సరఫరా చేయాలని జిల్లా సంయుక్త వ్యవ సాయ సంచాలకులు (జేడీఏ) బి.చంద్రనాయక్ డీలర్లను ఆదేశించారు. కొండాపురంలోని విత్తన సరఫరా గోడౌన్‌లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా గోడౌ న్‌లలో శనగ విత్తనాల నాణ్యతను పరిశీలించి, రికార్డుల ను తనిఖీ చేశారు. రాబోయే రబీ సీజన్‌కు రైతులకు అవసరమైన విత్తనాలను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని మిల్లు యజమానులను ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లో శనగ విత్తనాల సరఫరా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ నెల 25లోపు రైతు సేవా కేంద్రంలో రైతులు పంట నమోదు చేయించు కోవాలని తెలిపారు. బీడు భూములకు కూడా పంట నమోదు తప్పనిసరిగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా లావనూరు గ్రామంలో సాగుచేసిన శనగ పంటను, ఈ క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ రామమోహన్‌రెడ్డి, ఏవో రామాంజులరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు చిన్నచౌక్ పోలీసుల తెలిపారు. సుబ్బరాయుడు అనే వృద్ధుడు అదే ప్రాంతానికి చెందిన ఎనిమిది సంవత్సరాల బాలిక ఇంటి వద్ద ఆడుకుంటుండగా ఇంట్లోకి పిలిచి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక భయపడి కేకలు వేయడంతో బంధువులు అక్కడికి వచ్చి రక్షించారు. ఈ మేరకు చిన్నచౌక్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

కులంపేరుతో దూషించిన వ్యక్తిపై..

కడప క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప నగరం శంకరాపురంలో విజయ్‌కుమార్ అనే వ్యక్తిపై దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించిన ఒకరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. సీఐ వివరాల మేరకు శంకరాపురానికి చెందిన విజయ్‌కుమార్ సమీపంలో ఉన్న అక్కిశెట్టి వెంకట్ మంగళవారం చిన్న విషయమై గొడవ పడ్డారు. దీంతో విజయ్‌కుమార్‌ను వెంకట్ కొట్టడంతో పాటు కులం పేరుతో దూషించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

ఆదరణ లేని వృద్ధురాలు బిడ్డల చెంతకు..



తల్లిని నిరాదరణకు గురిచేసిన కుమారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న జడ్జి

కడప రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆదరణ లేకుండా ఒంటరిగా జీవిస్తున్న వృద్ధురాలు బుసల లక్షుమ్మను డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ బిడ్డల చెంతకు చేర్చారు. కడప నగరం తారకరామ నగర్‌లో లక్షుమ్మ ఆదరణ లేకుండా ఒంటరిగా జీవిస్తున్నట్లు డీఎల్ఎస్ఏకు తెలిసిన వెంటనే జడ్జి స్పందించారు. ఈ మేరకు జడ్జి వృద్ధురాలితో మాట్లాడి నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నట్లు తెలుసుకున్నారు. బిడ్డలను డీఎల్ఎస్ఏకు రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కూతురు తమ వద్ద తల్లిని ఉంచుకోవడంతో పాటు పెద్ద కుమారుడు బుసల రమణ, రెండవ కుమారుడు బుసల చిన్నప్ప, మూడవ కుమారుడు బుసల చంద్రలు తల్లి లక్షుమ్మకు ప్రతి నెలా ఒక్కొక్కరు రూ.1500 ఇచ్చేలా ఒప్పుకున్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం గురించి జడ్జి తెలియజేశారు.

పంచాయతీ ఆదాయ వనరులను సమీకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో రాజ్యలక్ష్మి

కడప రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పరిధిలో ఆదాయ వనరులను సమీకరించుకొని తద్వారా పల్లెసీమల ప్రగతికి బాటలు వేయాలని పంచాయతీశాఖ జిల్లా అధికారి (డీపీవో) రాజ్యలక్ష్మి, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యంలు పేర్కొన్నారు. మంగళవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో గ్రామ పంచాయతీ సొంత ఆదాయ వనరుల సృష్టి అనే అంశంపై ఎంపీడీవోలకు, డిప్యూటీ ఎంపీడీవోలకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెసీమల ప్రగతికి ప్రభుత్వం ప్రముఖ ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ పరిధిలోని వనరుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకొని తద్వారా పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. సొంత భవనాలు, ఇంటిపన్ను, నీటి వినియోగపు చార్జీలు, వారాంతపు సంతలు, జీవాల సంతలు, జంతు వధశాలల నిర్వహణ, ట్రేడ్ లైసెన్సుల జారీ, పరిశ్రమలు, ఫ్యాక్టరీల ద్వారా పన్నులు తదితర వాటి ద్వారా ఆదాయాన్ని సమకూర్చి అభి వృద్ధి పనులను చేపట్టాలన్నారు. అలాగే గ్రా మ పంచాయతీల స్థిరమైన వనరుల సృష్టికోసం ఆదాయ అంచనా, ప్రణాళిక, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, నైపుణ్యాల ప్రాముఖ్యత తదితర వాటిని వివరించారు. ఇతర రాష్ట్రాలలో సొంత ఆదాయ వనరుల సమీకరణలో సాధించిన ప్రగతిని తెలియజేశారు. పంచాయతీలోని ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు.డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, ట్రైనింగ్ మేనేజర్ సురేష్, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్, గేట్ ఉచిత శిక్షణకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఫైనలి యర్ చదువుతున్న విద్యార్థులు యూపీఎస్సీ ద్వారా నిర్వహించే సివి ల్స్ పరీక్ష, ఇంజనీరింగ్ ద్వారా నిర్వ హించే గేట్ పరీక్ష ఉచిత శిక్షణకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌కు చెంది న కోనం ఫౌండేషన్ ద్వారా ఉచిత శిక్ష ణతో పాటు ఫెలోషిప్ అందిస్తారని డైరెక్టర్ తెలిపారు. ఇటీవల ఫౌండేషన్ ద్వారా ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఏస్ ఇంజనీరింగ్ విద్యాసంస్థ ద్వారా గేట్ పరీక్షకు ప్రవేశపరీక్ష నిర్వహించగా సివిల్స్‌కు సంబంధించి 9 మంది, గేట్ పరీక్షకు 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారని డైరెక్టర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఫౌండేషన్ ద్వారా ఉచిత శిక్షణతో పాటు ఫెలోషిప్ ఇస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఉన్నత ఉద్యో గ అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం కైవసం



శ్యాం కార్తికేయను అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 69వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో పోటీల్లో ప్రొద్దుటూరుకు చెందిన శ్యాంకార్తికేయ బంగారు పతకాన్ని కైవసం చేసుకుని మొదటి స్థానంలో నిలిచారు. ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు గుంటూరు సమీపంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించినట్లు తైక్వాండో కోచ్ రాజేష్ తెలిపారు. ఈ పోటీల్లో అండర్-21 వెయిట్ కేటగిరిలో 6వ తరగతి చదువుతున్న శ్యాం కార్తికేయ ప్రతిభను కనపరచి గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నాగల్యాండ్‌లో జాతీయస్థాయిలో జరుగబోయే నేషనల్ స్కూల్‌గేమ్స్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

వాయు కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు : కలెక్టర్



వాయు కాలుష్య నియంత్రణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో వాయు కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వాయు కాలుష్య నియంత్రణ అమలుపై సమావేశం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు దేశంలోని వాయుకాలు ష్యం కలిగిన 132 నగరాలలో కాలుష్య నియంత్రణకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. వాటిలో కడప నగరం ఒకటని, ఈ ప్రాంతంలో వాయు కాలుష్యం వ్యాపించడంపై మూల కారణాలు తెలుసుకొని, నియంత్రించేందుకు అవసరమైన కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్య నియంత్రణకు నగరంలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. వాహనాల ద్వారా కాలుష్యం వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో వాయు కాలుష్యం వ్యాప్తి చెందే ముఖ్యమైన ప్రాంతాలను గుర్తించి నియంత్రణకు చర్యలు తీసు కోవాలన్నారు. నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వాయు కాలుష్య నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నగరంలో వాయు కాలుష్య పర్యవేక్షణకు ఆరు ఆపరేటింగ్ స్టేషన్లు పనిచేస్తున్నాయన్నారు. అనంతరం కడప కాలుష్య నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో రూపొందించిన దివాలీ ఏకో ఫ్రెండ్లీ గిఫ్ట్ పోస్టర్స్‌ను కలెక్టర్ అధికారులతో కలసి ఆవిష్కరించారు, కార్యక్రమంలో నగర కమిషరు మనోజ్‌రెడ్డి, పర్యావరణ ఇంజనీరింగ్ అధికారి సుధా కురుభ, కార్పొరేషన్ ఎస్ఈ చెన్న కేశవరెడ్డి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ పరీక్షల తనిఖీ



పరిశీలిస్తున్న వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్ర జ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయంలో జరుగుతున్న లా సెమిస్టర్ పరీక్షలను నూతన ఉపకులపతి ప్రొఫె సర్ బెల్లంకొండ రాజశేఖర్ మంగళవారం తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల గురించి చీఫ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ జి.కాత్యాయని వివరించారు. ప్రస్తు త పరీక్షకు 503 మంది హాజరయ్యా రని, 67 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వీసీ వెంటకంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు ఉన్నారు. పరీక్షల అబ్జర్వర్ డాక్టర్ గణేష్‌నాయక్, సహాయ పరీక్షల అధికారులు డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్, డాక్టర్ మునికుమార్, సిబ్బంది, పి.చంద్రమౌళి పాల్గొన్నారు.

రాయలసీమ సమస్యలను ప్రస్తావించాలి

వేంపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి బహిరంగసభలో రాయలసీ మ సమస్యల గురించి ప్రస్తావించాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర విభజన సమయంలో రాయలసీమకు అన్యాయం జరిగిందన్నారు. రాయలసీమకు హక్కుగా రావా ల్సిన అన్నింటిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాయల సీమకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, కడపకు సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం, రాయలసీమ సమగ్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని నిధులు కేటాయించాలన్నారు. కడప, రాయచోటి, మదనపల్లె, బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైల్వే నిర్మాణాన్ని పూర్తి చేయించాలని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని తులసిరెడ్డి కోరారు.

ఇబ్బందులు లేకుండా రీ సర్వే చేపట్టాలి



రాఘవాపురం గ్రామంలో భూముల రీసర్వేని పరిశీలిస్తున్న శ్రీనివాసులరెడ్డి

ముద్దనూరు/మైదుకూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సెంట్రల్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ముద్దనూరు మండలంలోని కొత్తపల్లె, వేల్పుచర్ల గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న ఫేస్-3 భూముల రీసర్వేని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. వి.రాఘవాపురం గ్రామ పొలంలో చేపడతున్న రీసర్వేని పరిశీలించారు. రైతులకు రీసర్వేపై సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం కొత్తపల్లె గ్రామ సచివాలయంలో డివిజన్ పరిధిలోని మండల, గ్రామ సర్వేయర్లతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు ఇచ్చారు. అసిస్టెంట్ డైరెక్టర్ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పుల్లయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కె.హరి, డీటీ వరదకిశోర్ రెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.

రైతులతో సమావేశం

మైదుకూరు మండలంలోని శివపురంలో జరుగుతున్న రీసర్వే పనులను సెంట్రల్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ పరిశీలించి రైతులతో నేరుగా విచారించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రీ సర్వేకు వస్తున్నాం అని ఒక రోజు ముందు మాత్రమే రెవెన్యూ అధికారులు నోటీసులు ఇస్తున్నారని ఫిర్యాదు చేశారు. రీసర్వేకి కొంత సమయం ఇవ్వాలని కోరారు. అనంతరం ఆయన రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

నేడు టపాసుల దుకాణాలకు లాటరీ

కడప కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా నగర పరిధిలో బాణా సంచా దుకాణాల ఏర్పాటుకు బుధవారం సాయంత్రం 6 గంటలకు కడప ఆర్డీవో కార్యాలయంలో లాటరీ పద్ధతిలో దుకాణాల కేటా యింపు చేస్తామని ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. బాణాసంచా దుకాణాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న నిర్వాహకులందరూ పాల్గొనాలని ఆర్డీవో ప్రకటనలో కోరారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

కడప నాగరాజుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల కోసం ఈనెల 16వ తేదీ ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు విద్యుత్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యుత్ అదాలత్‌లో తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ (విశ్రాంతన్యాయమూర్తి) హాజరవుతారన్నారు. దీర్ఘకలికంగా ఉన్న సమస్యలు, ప్రత్యేక అదాలత్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

అధికారులు, నేతలు ప్రజాసేవకులే

ప్రజలకు జవాబుదారీగా పనిచేద్దాం ● వాల్మీకిపురం, గుర్రంకొండ సమీక్షల్లో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పిలుపు

వాల్మీకిపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ ప్రజా సేవకులేనని ప్రతి ఒక్కరూ ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో చేసిన భూకబ్జాలు, అవినీతి బాగోతాలకు తమ ప్రభుత్వంలో చోటు ఉండదన్న విషయాన్ని అధికారులు, నాయకులు గుర్తు పెట్టుకోవాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ ట్రాన్స్‌కో శాఖల్లో రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రస్తుతం మండలంలో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఓలు పద్ధతి మార్చుకోవాలని, రైతుల సమస్యలకు డబ్బు వసూలు చేయడం లాంటి అవినీతి పనులు మానుకోవాలన్నారు. రికార్డులు మార్చేస్తాం, కబ్జాలకు సహకరిస్తాం అంటే అది అధికారులైనా పార్టీ నేతలైనా సహించేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఏ అధికారి ఏం చేస్తున్నాడు, నేతల పరిస్థితి ఏంటి అన్న విషయం కూడా తనకు తెలుసని నిబద్ధతతో ప్రజా సమస్యల పరిష్కారం బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మండల మహిళా సమాఖ్యలో వైసీపీ ప్రభు త్వంలో చోటు చేసుకున్న అవినీతి విషయంలో గట్టి చర్యలు తీసుకోవాల ని ఏపీఎం నరోత్తమరెడ్డిని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల ఏర్పాటు తదితర సమ స్యలన్నింటినీ తక్షణ పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపము ఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత కంభం నిరంజన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ వల్లిగట్ల వెంకట రమణ, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీడీఓ మనోహర్‌రాజు, నేతలు గాంధీపేట రమణ, పీవీ నారాయణ, రాజేంద్రాచారి, కోసూరి రమేష్, మురళి, వేషాద్రిరెడ్డి, ద్వారకనాథరెడ్డి, సయ్యద్‌బాషా, సుధాకర్‌రెడ్డి, డిష్‌బ్రదర్స్, అధికారులు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వాల్మీకిపురం సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

సమస్యలను పరిష్కరించండి

గుర్రంకొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షించిన ఆయన మా ట్లాడుతూ ప్రజలకు అవసరమైన తా గునీరు, సీసీరోడ్లు తదితర సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేయాలని సూచించారు. అనంతరం గ్రామాల వారీ నేతలతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రతి ప్రాంతాన్నీ అభివృద్ధి చేస్తాం

పీకేఎం ఉడా చైర్మన్ సురేష్‌బాబు


సమావేశం నిర్వహిస్తున్న చైర్మన్ సురేష్‌బాబు

కురబలకోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పీకేఎం ఉడా పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని పీకేఎం ఉడా చైర్మన్ సురేష్‌బాబు అన్నారు. మంగళవారం ముదివేడు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఎంజీఎం లేఅవుట్‌కు సంబంధించి అధికారులు, రైతులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ లేవుట్ ఏర్పాటుతో రైతులకు న్యాయం చేస్తామన్నారు. రైతులు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించాలని, లే అవుట్ ద్వారా వచ్చిన ఆదాయంతో ఆ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. మదనపల్లె, తంబళ్ళపల్లె నియోజకవర్గాల పరిధిలో ప్రజల సౌకర్యార్థం అన్ని వసతులతో కూడిన మరిన్ని లేఅవుట్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మదనల్లె మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్రణాళికలను సిద్ధం చేశామని, దీనికి ప్రభుత్వ అనుమతులు వచ్చాయని త్వరలో అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్ధార్ తపశ్విని, ఆర్ఐ శేషాద్రి, వీఆర్‌ఓ కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలి


ఈకేవైసీ నమోదును తనిఖీ చేస్తున్న వెంకటరత్నం

కురబలకోట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధికూలీలు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. తెట్టులో జరుగుతున్న ఈకేవైసీ నమోదును తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ ఉపాధిలో పని చేస్తున్న ప్రతి ఒక్కరు, రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని లేకుంటే జాబ్‌కార్డులు రద్దు అవుతాయన్నారు. ఏపీడీ నందకుమార్, సీఎల్ఆర్‌సీ కో ఆర్డినేటర్ చందన, ఏపీఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఈకేవైసీ కాకుంటే జాబ్‌కార్డులు రద్దు....

నిమ్మనపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధిలో జాబ్‌కార్డు కలిగిన రైతులు ఈకేవైసీ చేసుకోకుంటే వారి కార్డు వాడుకలో వుండదని, ఉపాధి పనికి అనర్హులని ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీఓ రమేష్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలంయంలో మండల అధికారులతో వారు మాట్లాడుతూ ఉపాధి హమీలో అవకతవకలు జరగకుండా వుండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాబ్‌కార్డు కలిగిన శ్రామికులకు కుటుంబాలకు ఈకేవేసీ తప్పనిసరి చేసినట్లు తెలిపారు. కార్డులో ఎంత మంది వుంటే అందరూ ఈకేవైసీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, ఏపీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దారి మూసేశారని స్థానికుల నిరసన


మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న స్థానికులు

మదనపల్లె, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా రాకపోకలు సాగిస్తున్న దారిని పోలీసులు మూసేశారని స్థానికులు నిరసన తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన అనంతరం సమస్యను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని అమ్మినేనివీధి నుంచి పోలీస్‌క్వార్టర్స్ లైన్ మీదుగా బెంగళూరు రోడ్డు వరకూ రహదారి ఉంది. ఈ ప్రాంతం ప్రజలంతా కొన్నేళ్లుగా ఈ మార్గం గుండా వెళ్తున్నారు. మున్సిపల్ ప్లాన్‌లోనూ ఈ మార్గాన్ని కలుపుతూ స్కెచ్ ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అయితే ఉన్నట్లుండి మూడురోజుల కిందట వన్‌టౌన్, తాలూకా పోలీస్‌స్టేషన్ లైన్ గుండా వెళ్లే దారికి అడ్డంగా పోలీసులు గోడ నిర్మించారు. ఇక్కడ డీఎస్పీ కార్యాలయం నిర్మించాలనే ప్రతిపాదనతో పనులు ప్రారంభించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు చెబుతున్నారు. 2009లో పోలీసులు దారికి అడ్డంగా బండలు నాటడంతో అప్పట్లో న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో తిరిగి వాటిని తొలగించారని, అప్పటి నుంచి యధావిధిగా రాకపోకలు సాగిస్తుండగా, తాజాగా దారిని మూసేయడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన వారిలో కౌన్సిలర్ ఎం.నాగార్జున బాబు, మాజీ కౌన్సిలర్ పులి మహాలక్ష్మి, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ దేవేంద్ర(చిన్నా), రాజేష్, అంజనాచౌదరి, తదితరులున్నారు.

వైసీపీ నేతల ఆరోపణలు అవాస్తవం

మదనపల్లె ఎంపీడీఓ తాజ్‌మస్రూర్

మదనపల్లె టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ సర్పంచ్‌లను తాను వేధిస్తున్నానంటూ వైసీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదులో ఆరోపణలు అవాస్తవమని మదనపల్లె ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రేగంటివారిపల్లె పంచాయతీలో నాలుగేళ్లుగా నిధులు దుర్వినియోగమైనట్లు ఫిర్యాదులు రావడంతో డీఎల్‌పీఓ విచారించి డీపీఓకు నివేదికలు పంపగా ఈ ఏడాది ఫిబ్రవరిలో సర్పంచ్ ఈశ్వరమ్మ చెక్‌పవర్‌ను రద్దు చేశారన్నారు. అంకిశెట్టిపల్లె నిధులు దుర్వినియోగంపై సర్పంచ్ శరత్‌రెడ్డి చెక్‌పవర్‌ను డీపీఓ రద్దు చేశారన్నారు. దీంతో వైసీపీ నేతలు సబ్‌కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారని, అసలు ఫిర్యాదు కాపీలో సర్పంచ్‌ల సంతకాల బదులు ఒకే వ్యక్తి ఫోర్జరీ చేసినట్లు తెలుస్తోందన్నారు. ఒక ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తామని, తాను ఎలాంటి రాజకీయ ఒత్తిడులకు లొంగలేదని ఎంపీడీఓ స్పష్టం చేశారు.

సూపర్ జీఎస్టీని సద్వినియోగం చేసుకోండి


సిమెంట్ షాపు వద్ద జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

నిమ్మనపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై భారం పడకుండా జీఎస్టీని తగ్గించినట్లు ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. జీఎస్టీ ద్వారా తగ్గిన వస్తువుల ధరల నమూనాను ముద్రించి ప్రజలకు పంచుతూ అవగాహన కల్పించిన ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గుదల తరువాత చాలా రకాల వస్తువుల ధరల్లో మార్పులు వచ్చాయన్నారు. సిమెంట్ బస్తాపై రూ. 30లు తగ్గించినట్లు తెలిపారు. వ్యాపారులు తగ్గిన వస్తువు ధరను షాపుల ముందు డిస్‌ప్లే చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మస్తాన్ ఖాదర్‌వల్లి దర్గాలో గంధోత్సవం


దర్గాలో పాటలు పాడుతున్న దృశ్యం

రామసముద్రం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దిగువపేట సమీపంలో ఉన్న దివానే మస్తాన్‌ఖాదరి వల్లి దర్గాలో 62వ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గంధోత్సవం నిర్వహించారు. ఇండియన్ పెట్రోల్ బంక్ నుంచి దర్గా వరకు విద్యుత్ దీపాలతో అలంకరణ చేసి దర్గాను పలు రకాల పుష్పాలతో అలంకరించారు. కుల, మతాలకు అతీతంగా భక్తులు దర్గాను సందర్శించి చక్కెర చదివింపులు చేసి మొక్కు తీర్చుకున్నారు. కర్ణాటక నుంచి విచ్చేసిన మతబోధకులు ఆలపించిన ఖవ్వాలి పాటలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. వేడుకలను తిలకించడానికి విచ్చేసిన హిందూ ముస్లింలకు కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


మందులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

పీలేరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు ప్లాటినమ్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతిలోని అమర హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ వెంకటేష్ గురజాల, డాక్టర్ లోకేశ్, డాక్టర్‌తిరుమలేశ్, డాక్టర్ బేబీ షాలిని, డాక్టర్‌అగర్వాల్స్ ఆస్పత్రి కంటి వైద్య నిపుణులు సమంత్ రెడ్డి, పీలేరులోని చరణ్ దంత వైద్యశాల వైద్య నిపుణులు డాక్టర్ చరణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ సుచరిత 200 మందికి గుండె, బీపీ, షుగర్, దంత, కంటి జబ్బులు, ఇతర సాధారణ జబ్బులకు ఉచితంగా నిర్ధారణ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి వచ్చిన రోగులు, సహాయకులకు భోజనాలు అందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు ప్లాటినమ్ అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్ కుమార్ రెడ్డి, సురేశ్, కోశాధికారి శివఫణికుమార్, సీనియర్ సభ్యులు లయన్ సంజీవ రెడ్డి, లయన్ బలసా వేణుగోపాల్, రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి


గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంపీపీలు, సర్పంచ్‌లు దృష్టి పెట్టాలని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆర్‌జీఎస్‌ఏ ముగింపు శిక్షణలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల పాటు పాలన అందించిన ప్రజాప్రతినిధులు మిగిలిన కాలం అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలన్నారు. పంచాయతీలకు ప్రభుత్వం విడుదల చేసే 15ఫైనాన్స్ నిధులు ఏయే పనులకు ఖర్చు పెట్టాలి, ఖర్చు పెట్టాక తగిన బిల్లులు ఓచర్లు తప్పనిసరిగా మినిట్స్ బుక్‌లో రాయాలన్నారు. ఇన్‌చార్జి ఈఓఆర్డీ పవన్‌కుమార్, రిసోర్స్‌పర్సన్ గిరిధర్‌నాయక్, సర్పంచ్‌లు, ఎంపీపీలు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తీస్తున్న ఎక్స్‌కవేటర్ సీజ్


ఎక్స్‌కవేటర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించిన దృశ్యం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నమయ్య సర్కిల్ వద్ద గుట్టను చదును చేస్తూ మట్టి అక్రమంగా తరలిస్తున్న ఓ వైసీపీ నేత ఎక్స్‌కవేటర్‌ను మంగళవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. సంఘటన స్థలానికి వెళ్లి సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ మేరకు తహసీల్దార్ పరిశీలించి జరిమానా విధించనున్నట్లు వీఆర్వో భరత్‌కుమార్ తెలిపారు.

కల్తీ మద్యం పాపం వైసీపీదే

పీలేరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యం తయారీ, విక్రయ పాపం వైసీపీదేనని పీలేరు నియోజకవర్గ టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ పోలిశెట్టి సురేంద్ర అన్నారు. పీలేరులో మంగళవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ అధికారంలో ఉన్న ఐదేళ్లూ సొంత మద్యం బ్రాండ్లు, కల్తీ మద్యాన్ని వైసీపీ నేతలు అమ్ముకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం కొలువు తీరాక, వారి ఆటలు సాగకపోవడంతో అప్పట్లో మిగిలిపోయిన కల్తీ మద్యాన్ని ప్రస్తుతం విక్రయించి ప్రభుత్వంపై కుట్రలు పన్నారన్నారు. ములకలచెరువులో కల్తీ మద్యం వ్యవహారంలో టీడీపీ నేతలు ఉన్నట్లు ఆరోపణలు వచ్చిన వెంటనే వారిని పార్టీ నుంచి చంద్రబాబు సస్పెండ్ చేశారని ఆయన గుర్తు చేశారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలపై ఎన్ని ఆరోపణలు వచ్చినా, హత్య కేసుల్లో సాక్ష్యాధారాలతో దొరికిపోయినా చర్యలు తీసుకున్న పాపాన పోలేదన్నారు. వాటన్నింటినీ మరిచి కల్తీ మద్యం వ్యవహారంలో వైసీపీ నేతలు చంద్రబాబు ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన తెలిపారు.

పీకేఎం ఉడా చైర్మన్‌ను కలిసిన టీడీపీ నేతలు


పీకేఎం చైర్మన్ సురేష్‌బాబుకు బొకే ఇస్తున్న రామకృష్ణ, ఖాదర్‌ఖాన్

మదనపల్లె, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పలమనేరు, కుప్పం, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీకేఎం ఉడా) చైర్మన్ సురేష్‌బాబును కూటమి నేతలు కలిశారు. ప్రమాణం అనంతరం మొదటిసారిగా మంగళవారం చైర్మన్ కార్యాలయానికి వచ్చిన ఆయనకు కూటమి నేతలు బొకేలు, పూలమాలతో స్వాగతం పలికారు. పీకేఎం ఉడా ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కార్యక్రమాల్లో మదనపల్లెకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. టీడీపీ సీనియర్ మైనార్టీనేత ఎస్.ఎ.మస్తాన్, హజ్‌కమిటీ రాష్ట్ర డైరెక్టర్ పఠాన్ ఖాదర్ ఖాన్, లోకేష్ యువసేన రాష్ట్రఅధ్యక్షుడు కంచర్ల చింటూ, రాటకొండ సోమశేఖర్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణాచారి, మాజీకౌన్సిలర్ బాబు నాయుడు, పూల మురళి, బీజేపీ నేత బండి ఆనంద్, నాగూర్‌వలి, వై.దొరస్వామినాయుడు, మహూల మురళి, ముదివేడు ఆయూబ్‌బాష ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం


బాలికల దినోత్సవం ఉద్దేశించి మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారులు

బి.కొత్తకోట, అక్టోబరు 14(ఆంధ్ర జ్యోతి): స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం చేసుకున్నారు. విద్యార్థినులను సమావేశ పరిచి ప్రపంచ వ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, లింగవివక్ష, మహిళా సంరక్షణ కోసం ప్రభుత్వాలు చేసిన చట్టాలు, సంక్షేమ పథకాలు, బాల్యవివాహాల నియంత్రణ, పోషణ, విద్య అంశాలపై అవగాహన కల్పించారు. మహిళా సంరక్షణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అక్టోబరు 11 నుంచి16 వరకు అంతర్జాతీయ బాలికా దినోత్స వం నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి ప్రకటించిందన్నారు. సిబ్బంది జయరాణి, నాగరత్న, హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, ఉషా, స్వరూపరాణి, వర్కర్లు పాల్గొన్నారు.

సంపూర్ణ పౌష్టికాహారంతో ఆరోగ్యానికి మేలు


కందుకూరు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ రామలక్ష్మి

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ పౌష్టికాహారంతోనే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని అంగన్‌వాడీ సూపర్ వైజర్ రామలక్ష్మి అన్నారు. మంగళవారం కందుకూరు-2 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నాగరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

జాక్‌పాట్‌ను పూర్తిగా రద్దు చేయాలి


మార్కెట్ శాఖ కార్యదర్శి కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న రైతు సంఘం నేతలు

గుర్రంకొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): టమోటా మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం యార్డులో పర్యటించి రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కార్యదర్శి కుమార్‌రెడ్డికి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మార్కెట్ యార్డులో వ్యాపారుల ఆగడాలు మితిమీరిపోయినట్లు చెప్పారు. జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయాలని అడిగితే రైతులపై దాడులు చేయడం దారుణమన్నారు. అలాంటి వ్యాపారులపై కేసులు నమోదు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నేతలు అమరనాథ్, శ్రీనివాసులు, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పీలేరులో ఎమ్మెల్యే సమీక్ష

పీలేరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి బుధవారం పీలేరు మండల సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివశంకర్, ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే సమీక్ష సమావేశానికి తమ శాఖల్లోని ప్రగతి నివేదికలతో విధిగా హాజరు కావాలని, అధికారులకు ఎంపీడీఓ తెలిపారు. మండల టీడీపీ ప్రజాప్రతి నిధులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని పురం రామ్మూర్తి తెలిపారు.

కలకడలో మధ్యాహ్నం...

కలకడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కలకడ ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అధికారులతో సమీక్షిస్తునట్లు ఎంపీడీఓ భానుప్రకాశ్ తెలిపారు. ఈ సమావేశానికి మండల అధికారులు హాజరు కావాలన్నారు.

బెల్ట్‌షాపులు అరికట్టాలని వినతి

పీలేరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు కేంద్రంగా నకిలీ మద్యం విక్రయాలు రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా సాగుతున్నాయని వాటిని అరికట్టాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పీలేరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించిన ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యంపై సీబీఐ విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజక వర్గ వైసీపీ ప్రజా ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ



మదనపల్లె అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పెంచుపాడు రోడ్డులోని సత్యసాయిబాబా ఆలయంలో మంగళవారం సత్యసాయి బాబా విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఆలయంలో సాయిబాబా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహంచారు. అనంతరం పుర వీధుల్లో సాయిబాబా చిత్ర పటాన్ని ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో సాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

ప్రతిష్ట దిగజార్చేందుకు కుట్ర

మదనపల్లెటౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ట దిగజార్చేందుకు వైసీపీ నేతలు కుట్ర పన్నుతున్నారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలోనే రాష్ట్రంలో కల్తీమద్యం తయారైందని జనార్ధనరావు చెప్పడంతో వైసీపీ నేతలు ఉలిక్కి పడి, రాష్ట్రంలో అన్ని ఎక్సైజ్ స్టేషన్‌ల వద్ద ధర్నా డ్రామాలు ఆడారన్నారు. ములకలచెరువు కల్తీమ ద్యం రాకెట్ కేసులో ఏ1 జనార్ధనరావు వైసీపీ నేత జోగి రమేష్ చెబితేనే కల్తీమద్యం తయారు చేశామనడం గమనార్హమన్నారు. వైసీపీ నాయకులు చేసిన కల్తీమద్యం దందాను కూటమి పాలనలో కూడా కొనసాగించాలని చూశారని, దీనికి చంద్రబాబు ప్రభుత్వం అడ్డుకట్ట వేసిందన్నారు. కల్తీ మద్యం కేసులో ఎంతటి వారినైనా ప్రభుత్వం ఉపేక్షించదని, దీని కోసం సిట్‌ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. వైసీపీ నేతలు కల్లబొల్లి ఆరోపణలు మానుకోవాలని లేకుంటే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. టీడీపీ నేతలు అన్వర్‌బాషా, గణేష్‌బాబు, మల్లికార్జున, ఇమామ్ సాహెబ్, లక్ష్మన్న, విద్యాసాగర్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి : సీపీఐ

మదనపల్లె అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయూ భవన్‌లో విలేకర్లతో జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు నెరవేర్చలేదన్నారు. మదనపల్లె- బెంగళూరు రైల్వేలైన్ ఏమైందని, మదనపల్లె జిల్లా ఎప్పుడు చేస్తారని, బీటీ కళాశాల యూనివర్శిటీ ఎప్పుడు అవుతుందని వారు ప్రశ్నించారు. నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రోడ్లు, సమస్యల పరిష్కరానికి ప్రభుత్వంపై పోరాడనున్నట్లు వివరించారు. సీపీఐ నేతలు మాధవ్, రెడ్డి, శేఖర్, సాయి పాల్గొన్నారు.